ఉడుపిలో కిశోర్ విజయకేతనం



కిశోర్ కుమార్ బోట్యాడి

మంగళూరు, న్యూస్‌టుడే : విధానపరిషత్‌లో ఖాళీగా ఉన్న దక్షిణ కన్నడ- ఉడుపి స్థానిక ప్రాధికార నియోజకవర్గానికి నిర్వహించిన ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి కిశోర్ కుమార్ బోట్యాడి విజయం సాధించారు. ఈ నియోజకవర్గం నుంచి ఇదివరకు గెలుపొందిన కోటా శ్రీనివాస పూజారి తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి, లోక్‌సభకు ఎన్నిక కావడంతో ఇక్కడ గత సోమవారం ఉప ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల కోసం 392 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, 5906 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళూరు సెయింట్ అలోషియస్ కళాశాలలో ఓట్ల లెక్కింపు గురువారం ఉదయం 8కి ప్రారంభమైంది. భాజపా అభ్యర్థి కిశోర్ కుమార్‌కు 3655, కాంగ్రెస్ అభ్యర్థి రాజు పూజారికి 1958, ఎస్‌డీపీఐ అభ్యర్థి అన్వర్ సాదత్‌కు 195, స్వతంత్ర అభ్యర్థి దినకర ఉళ్లాలకు 9 ఓట్లు రాగా, లోపం ఉన్న 90 ఓట్లను పక్కన పెట్టేశారు.

సతీశ్‌శైల్ అపరాధి : కోర్టు వెల్లడి



సతీశ్ శైల్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బేలేకేరి ఓడరేవు నుంచి ఇనుప ఖనిజాన్ని అక్రమంగా తరలించిన కార్వార ఎమ్మెల్యే సతీశ్ శైల్ అపరాధి అని చట్టసభ ప్రతినిధుల న్యాయస్థానం గురువారం తీర్పు ఇచ్చింది. శిక్ష ప్రమాణాన్ని శుక్రవారం ప్రకటిస్తామని న్యాయమూర్తి సంతోశ్ గజానన హెగ్డే తెలిపారు. తీర్పు ఇచ్చిన కొంత సమయానికే సీబీఐ అధికారులు ఆయనను అదుపులోనికి తీసుకుని పరప్పన అగ్రహార కారాగారానికి తరలించారు. ఎమ్మెల్యేతో పాటు అటవీశాఖ అధికారి మహేశ్ బిళియ అపరాధి అని న్యాయమూర్తి ప్రకటించారు. అంకోలా సమీపంలోని బేలేకేరి నుంచి 2010లో 88 లక్షల మెట్రిక్ టన్నుల ఇనుప ఖనిజాన్ని తరలించిన ఆరోపణలను సతీశ్ శైల్, ఇతర నిందితులు ఎదుర్కొంటున్నారు. మల్లికార్జున షిప్పింగ్ కంపెనీ ద్వారా ఈ ఖనిజాన్ని అక్రమంగా తరలించడం, విదేశాలకు ఎగుమతి చేసిన ఆరోపణలు ఉన్నాయి. దీనికి సంబంధించి సీబీఐ ఇప్పటికే ఆరు కేసులు నమోదు చేసింది. ఇదే కేసులో మాజీ మంత్రులు గాలి జనార్దనరెడ్డి, ఆనంద్ సింగ్, మాజీ ఎమ్మెల్యే అనిల్ లాడ్ తదితరులపైనా ఖనిజాన్ని అక్రమంగా తరలించిన ఆరోపణలు ఉన్నాయి.

మూడింటా.. ముఖాముఖి

● ఉప సమరానికి యోధులు సిద్ధం ● 'అసమ్మతి' ఎదుర్కొంటేనే విజయం



ఎన్‌డీఏ అభ్యర్థిగా నిఖిల్ పేరు ప్రకటించిన యడియూరప్ప, కుమారస్వామిని సత్కరిస్తున్న దళ్, భాజపా నేతలు

ఈనాడు, బెంగళూరు : పార్టీ ఫిరాయింపులు, అసమ్మతుల బుజ్జగింపులు, బెంగళూరు- దిల్లీ మధ్య రాకపోకలు, రాష్ట్ర- జాతీయ నేతల చర్చోపచర్చలు.. ఇలా సాధారణ ఎన్నికలకు ఏమాత్రం తీసిపోని రాజకీయ వ్యూహాల నడుమ ఎట్టకేలకు మూడు నియోజకవర్గాల ఉప ఎన్నికలకు అభ్యర్థులు సిద్ధమయ్యారు. మూడింటా రెండేసి పార్టీల తరఫున కీలక పోరుకు ఇద్దరు చొప్పున ప్రధాన అభ్యర్థులు ఖరారయ్యారు. నవంబరు 13న నిర్వహించే ఎన్నికల కోసం నామినేషన్లకు ఓ రోజు ముందుగా అభ్యర్థులను ప్రకటించిన పార్టీలు ఇక ప్రచార పర్వానికి తెరలేపనున్నాయి. ఇప్పటికే కొందరు అభ్యర్థులు నామినేషన్లు వేయగా, శుక్రవారం మరికొందరు ఆ పని ముగించి, ప్రచార వేదికలు ఎక్కబోతున్నారు. పేరుకు ఉప ఎన్నికలే అయినా మూడు ప్రధాన పార్టీలూ గెలుపోటములను ప్రతిష్ఠగా తీసుకుని పోరాటానికి సిద్ధమయ్యాయి. జాతీయ స్థాయిలో రెండు రాష్ట్రాల్లో సాధారణ ఎన్నికలు, మరికొన్ని చోట్ల ఉప ఎన్నికలుండగా, వాటిల్లో కర్ణాటకలోని మూడు క్షేత్రాలు రెండు జాతీయ పార్టీలకు, ఎన్‌డీఏ భాగస్వామిగా మారిన ప్రాంతీయ పార్టీ జేడీఎస్‌కు కీలకంగా మారాయి. రాష్ట్రంలో రానున్న 20 రోజుల పాటు భారీ వర్షాల మధ్య వేడెక్కించే ఎన్నికల వాతావరణాన్ని ప్రజలు చవిచూడనున్నారు.



భరత్ బొమ్మై



యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్

మూడూ కీలకమే

2023లో ఈ మూడు క్షేత్రాలను మూడు ప్రధాన పార్టీలు గెలుచుకున్నవే. శిగ్గావ్‌లో భాజపా అభ్యర్థి బసవరాజ బొమ్మై, చెన్నపట్టణలో జేడీఎస్ అభ్యర్థి కుమారస్వామి, సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం అప్పట్లో గెలిచారు. ఈ ముగ్గురూ 2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు మార్గం చూపారు. ఆ స్థానాలను తిరిగి దక్కించుకునేందుకు అభ్యర్థులతో పాటు వారి పార్టీలు చేస్తున్న కసరత్తు అంతా ఇంతా కాదు. ఇందు కోసం సరైన నేత లేకపోతే బయటి పార్టీ నుంచి అభ్యర్థిని రప్పించి మరీ బరిలో దింపటం గమనార్హం. అభ్యర్థి లేరంటే కుటుంబ సభ్యులను పోటీలో దింపారు. ఎన్ని వ్యూహాలు పన్నినా చివరకు గెలుపు సాధించటమే పార్టీల లక్ష్యం. అందు కోసం మూడు కీలక పార్టీల నుంచి దిగ్గజ నేతలు ప్రచారానికి సిద్ధమవుతున్నారు. చెన్నపట్టణలో ఎన్‌డీఏ అభ్యర్థి నిఖిల్ కుమారస్వామి విజయానికి మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడ, మాజీ ముఖ్యమంత్రి బి.ఎస్.యడియూరప్ప, కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రచార బరిలో దిగనున్నారు. ఇదే స్థానంలో పాత కాపు సి.పి.యోగేశ్వర్ కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆయన సోదరులు డీకే సురేశ్ కృషి చేస్తారు.


● శిగ్గావ్‌లో మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ బసవరాజ బొమ్మై కుమారుడి కోసం, సండూరులో భార్య అన్నపూర్ణ గెలుపు కోసం ఎంపీ తుకారామ్ ప్రచార రథాలను ఎక్కనున్నారు.

తలపడేది వీరే..

- ❒ **శిగ్గావి:** భరత్ బొమ్మై (భాజపా), యాసిర్ అహ్మద్ ఖాన్ పఠాన్(కాంగ్రెస్)
- ❒ **చెన్నపట్టణ:** నిఖిల్ కుమారస్వామి(జేడీఎస్-ఎన్‌డీఏ), సి.పి.యోగేశ్వర్(కాంగ్రెస్)
- ❒ **సండూరు:** అన్నపూర్ణ తుకారామ్ (కాంగ్రెస్), బంగారు హనుమంతు(భాజపా)



నిఖిల్ కుమారస్వామి



సి.పి.యోగేశ్వర్

తుకారామ్‌కు మంత్రులు జమీర్ అహ్మద్, సంతోష్ లాడ్, మాజీ మంత్రి బి.నాగేంద్ర చేయూత అందిస్తారు. సండూరులో భాజపా అభ్యర్థి బంగారు హనుమంతు తరఫున ఆయన గురువు, మాజీ మంత్రి గాలి జనార్దనరెడ్డి ప్రచార బాధ్యతలు తీసుకున్నారు. మొత్తంగా ఈ మూడు క్షేత్రాల ఎన్నికలు కన్నడనాట మినీ సమరంగా మారి రాజకీయ సెగలు పుట్టిస్తుండటం ప్రస్తావనార్హం.



చెన్నపట్టణ దళ్ అభ్యర్థిగా నిఖిల్‌కుమారస్వామి పేరు ఖరారు చేసేముందు బెంగళూరులో మాజీ ముఖ్యమంత్రి యడియూరప్పతో దళపతి కుమారస్వామి తదితరులు చర్చలు

ఊహించిన క్లైమాక్స్

చెన్నపట్టణలో అందరూ అంచనా వేసినట్లే నిఖిల్ కుమారస్వామి ఎన్‌డీఏ అభ్యర్థిగా పోటీలో దిగారు. ఇక్కడి భాజపా నేత సి.పి.యోగేశ్వర్ అనూహ్యంగా కాంగ్రెస్‌లో చేరటంతో ఎన్‌డీఏ నేతలు యుద్ధ ప్రాతిపదికన చర్చలు జరిపి అభ్యర్థిని ఖరారు చేశారు. రెండు రోజులుగా మాజీ ప్రధానమంత్రి దేవేగౌడ, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప నేతృత్వంలో సమావేశాలు నిర్వహించిన ఇరు పార్టీలు చివరకు నిఖిల్‌కు అవకాశం ఇచ్చారు. 2019లో మండ్య లోక్‌సభ, 2023లో రామనగర విధానసభ ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకున్న నిఖిల్ కుమారస్వామి మూడో ప్రయత్నంగా చెన్నపట్టణలో అదృష్ట పరీక్షకు సిద్ధమయ్యారు. ఈసారి ఎన్నికల పద్మవ్యూహాన్ని ఛేదించి తీరుతానని తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సందర్భంగా నిఖిల్ ప్రకటించారు. శుక్రవారం నామినేషన్ వేసే నిఖిల్‌కు తాత దేవేగౌడ మద్దతు దండిగా ఉంది. ఈ ఎన్నికలు ముగిసే వరకు చెన్నపట్టణలోనే ఉండి మనవడిని గెలిపిస్తానని దేవేగౌడ ప్రకటించారు. ఎన్‌డీఏ అభ్యర్థిని గెలిపించేందుకు రెండు పార్టీలూ సహకరించాలని యడియూరప్ప పిలుపునిచ్చారు. ఇదే స్థానానికి అందరూ ఊహించినట్లే సి.పి.యోగేశ్వర్‌కు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ గురువారం ఆయనతో నామినేషన్ వేయించింది.



సండూరు ఉప ఎన్నికల బరిలో దిగేందుకు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న అన్నపూర్ణ తుకారామ్



అన్నపూర్ణ తుకారామ్



బంగారు హనుమంతు

పేరు.. తారుమారు

భాజపా కంచుకోటగా పరిగణించే శిగ్గావ్‌లో ఇప్పటికే బసవరాజ బొమ్మై కుమారుడు భరత్ బొమ్మై అభ్యర్థిగా ప్రచారంలో దిగారు. గురువారం ఇంటి పెద్దల సూచనతో నామినేషన్ వేసిన ఆయన.. శుక్రవారం పార్టీ కీలక నేతల నడుమ మరోసారి నామినేషన్ వేస్తానని ప్రకటించారు. ఇక్కడ అభ్యర్థిని ప్రకటించేందుకు కాంగ్రెస్ కాస్త తడబడింది. బుధవారం రాత్రి ఎమ్మెల్యే వినయ్ కులకర్ణి కుమార్తె వైశాలి కులకర్ణి పేరును ఖరారు చేసిన ఏఐసీసీ గురువారం సాయంత్రానికి ఆ పేరును సవరించి మరోసారి ముస్లిం అభ్యర్థికి అవకాశం కల్పించింది. 2023 ఎన్నికల్లో 30 వేల ఓట్ల తేడాతో బొమ్మై చేతిలో ఓడిన యాసిర్ అహ్మద్ ఖాన్‌కు మరోసారి అవకాశం కల్పించింది. ముస్లిం ఓట్లు నిర్ణయాత్మకంగా ఉండే ఈ స్థానంలో వారికే సీటివ్వాలని పట్టుబట్టిన మంత్రి జమీర్ అహ్మద్ తన పంతాన్ని నెగ్గించుకున్నా తన ఆప్తుడు సయ్యద్ అజీమ్ పీర్‌కు టికెట్ ఇప్పించలేకపోయారు. అజీమ్‌తో పాటు వినయ్ కులకర్ణి అసమ్మతిని చల్లార్చటమే కాంగ్రెస్‌కు పెద్ద సవాలు

కార్యకర్తల్లో అసహనం

సండూరులో ఎంపీ తుకారామ్ భార్యకు టికెట్ ఇవ్వటంపై పార్టీ కార్యకర్తల్లో అసహనం పెల్లుబికింది. ఇప్పటికే నాలుగుసార్లు ఎమ్మెల్యే, ఓసారి ఎంపీ అయిన తుకారామ్ తీరుపై స్థానిక నేతలు తుముటి లక్ష్మణ్, శివరాం భీమప్ప తదితరులు వ్యతిరేకత చాటారు. పార్టీకి సేవలందించిన కార్యకర్తలను గుర్తించే సమయంలోనూ కుటుంబ రాజకీయం ఏమిటని వీరంతా ప్రశ్నిస్తున్నారు. వీరిని బుజ్జగించే బాధ్యతను సంతోశ్ లాడ్, జమీర్ అహ్మద్, మాజీ మంత్రి బి.నాగేంద్రకు అప్పగించిన సిద్ధరామయ్య ఈ క్షేత్రంపై పర్యవేక్షణ చేపడతానని హామీ ఇచ్చారు. ఇదే క్షేత్రంలో భాజపాకు అసమ్మతి సెగ తడుతోంది. టికెట్ ఆశావహులు మాజీ ఎంపీ దేవేంద్రప్ప, సీనియర్ నేత దివాకర్‌ను బుజ్జగించే బాధ్యతను గాలి జనార్దనరెడ్డి తీసుకున్నారు. దివాకర్, బంగారు హనుమంతుల్లో ఒకరికి టికెట్ ఇవ్వాలన్న జనార్దనరెడ్డి ప్రతిపాదనను అధిష్ఠానం ఆమోదించి అసమ్మతులను బుజ్జగించే బాధ్యతను కూడా అప్పగించింది.

హొరమవులో మరో భవంతికి ముప్పు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : బాబూసాపాళ్యలో ఆరు అంతస్తుల భవంతి కుప్పకూలిన ఘటన శిథిలాలు తొలగించక ముందే హొరమావు నంజప్ప గార్డెన్‌లో మరో భవంతి కొద్దిగా వాలిందని పాలికె అధికారులు గుర్తించారు. పుట్టప్ప అనే వ్యక్తికి చెందిన ఎనిమిది అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవు ఉన్న భవంతి దిగువ అంతస్తు గోడలకు నెర్రెలు రావడంతో అక్కడ ఉన్న బాడుగదారులను ఖాళీ చేయించారు.

చందనసీమకు నేడు ఉప రాష్ట్రపతి రాక

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మండ్య జిల్లా నాగమంగల తాలూకా బెళ్లూరు క్రాస్‌లోని ఆదిచుంచనగిరి మఠం బీజీఎస్ ఆవరణలో ఎయిమ్స్ ప్రాంగణానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్ శుక్రవారం చేరుకోనున్నారు. ఎయిమ్స్‌లో నిర్వహించే చర్చా కార్యక్రమంలో మాజీ ప్రధాని దేవేగౌడ, ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి, మండ్య జిల్లా వ్యవహారాల బాధ్యుడు చెలువరాయస్వామి, గుజరాత్‌లోని ఆర్ష విద్యామందిరకు చెందిన పరమాత్మానంద సరస్వతి తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారని మఠం ప్రతినిధులు తెలిపారు.

చెన్నపట్టణ.. మాకే పట్టం

సిద్ధరామయ్య ధీమా



నామినేషన్ వేయనున్న యోగేశ్వర్‌తో కలిసి ఊరేగింపుగా వస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, డీకే సురేశ్



నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న యోగేశ్వర్.. తోడుగా సిద్ధరామయ్య తదితరులు

రామనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ కనీసం 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. చెన్నపట్టణ నియోజకవర్గం అభివృద్ధి బాధ్యతను నేనే తీసుకుంటానని ప్రకటించారు. సీపీ యోగేశ్వర్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ఎంపీ డీకే సురేశ్‌తో కలిసి చెన్నపట్టణలో సిద్ధరామయ్య గురువారం రోడ్‌షో నిర్వహించారు. యోగేశ్వర్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కుమారస్వామి మండ్యకు మాత్రమే పరిమితమయ్యారని, గెలిచినా, ఓడినా చెన్నపట్టణ అభివృద్ధికి, చెరువుల పునర్జీవానికి యోగేశ్వర్ కట్టుబడి ఉండడంతోనే ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారని చెప్పారు. భాజపా, దళ్ ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు బరిలో నిలిచినా తమ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడక అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తమది ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమని, ప్రజలు మద్దతుగా ఉండడంతోనే పాలన సజావుగా చేస్తున్నామని తెలిపారు. చెన్నపట్టణలో ప్రచారానికి క్రమం తప్పకుండా వస్తానని ప్రకటించారు. రెండుసార్లు ముఖ్యమంత్రి అయినప్పుడు చెన్నపట్టణకు కుమారస్వామి విడుదల చేసిన నిధుల జాబితా ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు. ఈసారి ఉప ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. యోగేశ్వర్‌తో పాటు వచ్చి చేరిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తాము లౌకికవాదులమని చెప్పుకుంటూ, మతతత్వ పార్టీతో చేతులు కలిపిన దళ్‌ను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని విమర్శించారు. పార్టీ అభ్యర్థిని సైతం స్వయంగా ప్రకటించుకునే ధైర్యాన్ని దళ్ చేయలేకపోతుందని ఎద్దేవా చేశారు. టికెట్ ఇస్తారని భాజపాలో చివరి వరకు వేచి ఉన్నా, మొండి చేయి చూపిస్తారని గుర్తించి, కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చానని ఇదే సందర్భంలో యోగేశ్వర్ తెలిపారు.

బరిలోకి భరత్ బొమ్మై



నామినేషన్ పత్రాలు దాఖలు చేసి వస్తున్న భరత్ బొమ్మై

హావేరి, న్యూస్‌టుడే : శిగ్గావ్ ఉప ఎన్నికల్లో భాజపా అభ్యర్థి భరత్ బొమ్మై నామినేషన్ పత్రాలను గురువారం దాఖలు చేశారు. తన తండ్రి ఎన్నికల సమయంలో ప్రతిసారీ వినియోగించే వాహనంలోనే ఆయన మొదటి సెట్టు నామినేషన్ పత్రాలను తీసుకొచ్చారు. శుక్రవారం మరోసారి రెండో సెట్టు నామినేషన్ పత్రాలను దాఖలు చేస్తానని తెలిపారు. కొద్ది రోజులుగా నియోజకవర్గంలోని పెద్దలు, నేతలతో చర్చిస్తున్నట్లు ఆయన తెలిపారు. కొన్నేళ్లుగా తన తండ్రికి మద్దతుగా ప్రచారాన్ని చేస్తూ రావడంతో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వీధి తనకు కొట్టిన పిండేనని పేర్కొన్నారు.

యువతకు పెద్ద పీట: భాజపా యువతకు పెద్ద పీట వేస్తూ తన కుమారునికి టికెట్ ప్రకటించిందని చేసిందని హావేరి ఎంపీ బసవరాజ బొమ్మై పేర్కొన్నారు. మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేస్తున్న భరత్ బొమ్మై భారీ మెజార్టీతో గెలుపొందుతాడని ధీమా వ్యక్తం చేశారు. తాను ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతిసారీ తన తల్లి చెన్నమ్మతో కలిసి భరత్ ప్రచారాన్ని చేసేవాడని, ఈసారి ప్రచారానికి ఆ అనుభవమే ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు ఇష్టపడడం లేదని, ఉప ఎన్నికల ఫలితాలతో అది మరింత స్పష్టమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు.

నీటిగుంతలో పడి బాలుడి మృతి



సుహాస్

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బహుళ అంతస్తుల భవంతి లిఫ్టు కోసం తీసిన గుంతలో నిండిన నీటిలో పడి సుహాస్ (5) అనే బాలుడు మరణించాడు. కన్నమంగల పాలకేంద్రంలో లిఫ్టును ఏర్పాటు చేసేందుకు పెద్ద గుంతను తీశారు. వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు అందులో నీరు నిండింది. అక్కడ ఆడుకుంటూ సుహాస్ గుంతలో పడి, మునిగి మరణించాడు. మిల్క్ డెయిరీ అధ్యక్షుడిపై కాడుగోడు ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి విషాదాంతం

చామరాజనగర, న్యూస్‌టుడే : అయ్యనపుర గ్రామంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వారికి స్తంభం నుంచి వేలాడుతున్న విద్యుత్తు తీగ తగిలి పెను విపత్తు సంభవించింది. ఈ ఘటనలో నాగేంద్ర (48), మల్లేశ్ (50) అనే వ్యక్తులు మరణించారు. అయ్యనపుర నుంచి హిత్తలగుడ్డె రహదారిలో గురువారం ఉదయం వెళుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుదాఘాతంతో ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. చామరాజనగర గ్రామీణ ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

భక్తులకు హాసనాంబ దర్శనం



హాసనాంబ విగ్రహం ముంగిట దీపజ్వాల

హాసన, న్యూస్‌టుడే : హాసనలో ఏడాది అనంతరం హాసనాంబ ఆలయం తలుపులు గురువారం తెరుచుకున్నాయి. ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథ స్వామి, సిద్ధగంగ మఠం మఠాధిపతి శివలింగస్వామి, జిల్లా వ్యవహారాల బాధ్యుడు కేఎన్ రాజణ్ణ, జిల్లాధికారి సత్యవతి, ఆలయం అర్చకులు, మైసూరు రాజవంశస్థుల కుటుంబానికి చెందిన నంజేరాజ అరసు సమక్షంలో గర్భగుడి తలుపులు తెరిచారు. నిరుడు గర్భగుడి మూసే సమయంలో వెలిగించిన రెండు దీపాలు ఇప్పటికీ వెలుగుతూ కనిపించాయి. గర్భగుడిలో నంజేరాజ అరసు అరటి బోదెను నరికిన అనంతరం అమ్మవారి దర్శనానికి కొందరు భక్తులను అనుమతించారు.



మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సీఎం



ఎమ్మెల్యే బైరతి బసవరాజ్, ఇతర అధికారులతో మాట్లాడుతున్న సిద్ధరామయ్య

భవన బాధితులకు వెన్నుదన్ను

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : రాజధాని నగరాన్ని ఉలికిపాటుకు గురిచేసిన ఆరంతస్తుల భవంతి కూలిపోయిన ఘటనలో బాధితులను ఆదుకుంటామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. బాబుసాపాళ్యలో ఈ భవనం మూడు రోజుల కిందట కూలిపోవడం తెలిసిందే. ఘటనలో మరణించిన ఎనిమిది మందికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తలా రూ. 5 లక్షల పరిహారాన్ని ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రమాద స్థలంలో బాధితుల కుటుంబ సభ్యులను ఆయన గురువారం పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి మెరుగైన చికిత్సను అందించాలని వైద్యులను ఆదేశించారు. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని అడ్డుకోని అధికారులు, ఇంజినీరుపై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రికి పాలికె కమిషనర్ తుషార్ గిరినాథ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులు తమ గోడును సిద్ధరామయ్య వద్ద వెళ్లబోసుకున్నారు.



ఆసుపత్రిలో బాధితుడ్ని పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి

● ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి కూడా బాధితుల కుటుంబాలకు తలా రూ.2 లక్షలను ప్రకటించారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆరుగురు కార్మికులకు తలా రూ.50 వేలను ప్రధాని ప్రకటించారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

రక్షకభటుడి సాహసం

శివమొగ్గ: సహ్యాద్రి కళాశాల సిగ్నల్ వద్ద వేగంగా వస్తున్న కారును ఆపేందుకు ఒక కానిస్టేబుల్ ప్రయత్నించారు. కారు నిలపకుండా ముందుకు వస్తుండడంతో ఆయన అడ్డుగా నిలిచారు. తనపైకి దూసుకు వస్తున్న కారు బ్యానెట్‌పైకి ఎక్కి కానిస్టేబుల్ కూర్చున్నారు. వంద మీటర్ల వరకు కారును నిలపకుండా డ్రైవరు ముందుకు వెళ్లాడు. ముందు కూడలి వద్ద ట్రాఫిక్ జామ్ ఉండడంతో అతను తప్పనిసరిగా కారు నిలపవలసి వచ్చింది. స్థానికుల సహకారంతో డ్రైవరును పోలీసులు గురువారం మధ్యాహ్నం అరెస్టు చేశారు.

మొబైల్ టవర్.. మాయం!

శివమొగ్గ, న్యూస్‌టుడే : టిప్పునగరలోని ఒక ఖాళీ సంస్థలో 2008 నుంచి ఉన్న ఒక టెలికాం సంస్థ మొబైల్ టవర్‌ను దుండగులు పెకిలించుకెళ్లారు. మొదట టవర్ వద్ద బ్యాటరీలు, ఇతర విడిభాగాలను నిందితులు తీసుకువెళ్లారు. అనంతరం టవర్ బోల్టులు విప్పదీసుకుని, లారీలో వేసుకుని వెళ్లారు. రూ.46.30 లక్షల టవర్ దొంగతనమైందని సంస్థ యాజమాన్య ప్రతినిధుల ఫిర్యాదుతో తుంగానగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సండూరు కాంగ్రెస్‌దే!

నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థి అన్నపూర్ణ



తరలివచ్చిన కార్యకర్తలు

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి ఇ.అన్నపూర్ణ తుకారామ్ గురువారం నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. మొదట స్థానిక కూడ్లిగి రహదారిలోని ఏపీఎంసీ మార్కెట్ నుంచి ప్రారంభమైన ఊరేగింపులో ఓపెన్‌టాప్ వాహనంలో అభ్యర్థి ఇ.అన్నపూర్ణ తుకారామ్‌తో పాటు మంత్రులు సంతోష్ ఎస్.లాడ్, జమీర్ అహ్మద్ ఖాన్, మాజీ మంత్రి బి.నాగేంద్ర, లోక్‌సభ సభ్యుడు ఇ.తుకారామ్, ఎమ్మెల్యేలు గణేష్, బి.ఎం.నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, శివయోగి, మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులు, మండలి రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజ తదితరులు ఊరేగింపుగా బయలుదేరారు. ఏపీఎంసీ మార్కెట్ నుంచి కూడ్లిగి రహదారి మీదుగా విజయకూడలి వరకు ఊరేగింపు నిర్వహించారు.

మూడు సెట్ల నామినేషన్ పత్రాలు

ఊరేగింపుగా వచ్చిన అభ్యర్థితో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు తదితర నేతలను తహసీల్దార్ కార్యాలయంలోకి అనుమతించారు. మంత్రులు సంతోష్ ఎస్.లాడ్, జమీర్ అహ్మద్ ఖాన్‌లతో పాటు అభ్యర్థి అన్నపూర్ణ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు. మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, ఎంపీ ఇ.తుకారామ్ కుటుంబ సభ్యులతో కలిసి అన్నపూర్ణ రెండో సెట్‌ను, మాజీ మంత్రి బి.నాగేంద్ర, ఎమ్మెల్యే బి.ఎం.నాగరాజు, కె.ఎం.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు భీమానాయక్‌తో కలిసి మరో సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ముందు జాగ్రత్తగా ఏఎస్పీ రవికుమార్ నేతృత్వంలో డీఎస్పీ ప్రసాద్ గోఖలే నేతృత్వంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న మంత్రులు జమీర్ అహ్మద్ ఖాన్, సంతోష్ ఎస్.లాడ్

సండూరు కాంగ్రెస్‌కు కంచుకోట

జనార్దన్‌రెడ్డి కాదు.. ఎవరు వచ్చి అక్కడే తిష్ట వేసినా కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ 40 నుంచి 50 వేల ఆధిక్యతతో గెలుపు పొందడం కచ్చితం. దీనిపై ఎలాంటి అనుమానం లేదు. సండూరు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని మరోసారి ఈ ఉప ఎన్నికల్లో రుజువు అవుతుందని జిల్లా బాధ్య మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ అన్నారు. నామినేషన్ అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇ.తుకారామ్ నాలుగు సార్లు ఎమ్మెల్యే కావడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి శ్రమించారు. 10 రోజుల ముందు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్య మంత్రి నేతృత్వంలో మరో రూ.1650 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించారని తెలిపారు. అధిష్ఠానం పార్టీ అభ్యర్థిని ప్రకటించింది. పార్టీలో ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవు. అందరు ఐకమత్యంగా పార్టీ అభ్యర్థి గెలుపునకు శ్రమిస్తామన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్, అగ్రనేత రాహుల్‌గాంధీ మార్గదర్శనంలో ఐదు గ్యారంటీలు ప్రవేశపెట్టారు. గ్యారంటీలపై ఇంటింటికీ వెళ్లి వివరిస్తామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి సంతోష్ ఎస్.లాడ్ తెలిపారు. నామినేషన్ పత్రం సమర్పించిన అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. సండూరు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణ గెలుపు తథ్యం..దీనిపై ఎలాంటి అనుమానం లేదని మాజీ మంత్రి బి.నాగేంద్ర పేర్కొన్నారు. 2008 నుంచి వరసగా ఇ.తుకారామ్ గెలుపొందారన్నారు.



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న అభ్యర్థి అన్నపూర్ణ, మంత్రులు, నేతలు

ఆయన 'బంగారు' హనుమంతే!



బంగారు హనుమంత

బళ్లారి, న్యూస్‌టుడే: భాజపా అభ్యర్థి బంగారు హనుమంత వద్ద 2.5 కిలోల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వాటి విలువ రూ.2 కోట్లు. 25కిలోల వెండి వస్తువులు, మొత్తం విలువ రూ.20 లక్షలు ఉంటాయని నామినేషన్ పత్రంలో సమర్పించిన అఫిడవిట్‌లో వివరాలు అందజేశారు. హనుమంత భార్య బంగారు రూపశ్రీ వద్ద 500 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి, వీటి విలువ రూ.40 లక్షలు, రూ.12 లక్షల విలువైన 15 కిలోల వెండి వస్తువులు కూడా ఉన్నట్లు వివరాలు వెల్లడించారు. హనుమంత తండ్రి బంగారు సోమప్ప, తల్లి బంగారు హులిగెమ్మల మద్ద వరుసగా 350 గ్రాములు, 450 గ్రాములు బంగారు ఆభరణాలు ఉన్నాయి. తండ్రి వద్ద 5 కిలోల వెండి వస్తువులు, తల్లి వద్ద 15 కిలోల వెండి వస్తువులు ఉన్నట్లు వివరాలు వెల్లడించారు. అభ్యర్థి బంగారు హనుమంత వద్ద రూ.5లక్షల నగదు ఉంది. ఐదు వేర్వేరు బ్యాంకుల్లో పొదుపు ఖాతాలు ఉన్నాయి. బంగారు గుహన్ అగ్రి పౌల్ట్రీ పేరుతో ప్రత్యేక బ్యాంకు ఖాతా ఉంది. మంగళూరులో రూ.1,07,38,00 విలువైన రిసార్ట్ ఉంది. స్టోన్ క్రషర్లు, పౌల్ట్రీ ఫారాలు కూడా ఉన్నాయి. ఫార్చ్యూనర్ విలువైన కారు, బుల్లెట్ బైకు ఉంది. ట్రాక్టర్, జేసీబీలు ఉన్నాయి. బంగారు హనుమంత వ్యక్తిగత వారసత్యం సంపద మొత్తం విలువ రూ.7,58,64,019, భార్య వారసత్వం రూ.1,69,82,571 ఉన్నట్లు చూపించారు.

స్థిరాస్తి వివరాలు.. బంగారు హనుమంతకు 28 చోట్ల మొత్తం 54.11 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. భార్యకు 27.27 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని విరాళంగా ఇచ్చారని వివరాలు వెల్లడించారు. బంగారు హనుమంత తన భూమి ప్రస్తుత విలువ రూ.4కోట్లు ఉంటుందన్నారు. కొట్టూరు, కూడ్లిగి, హగరిబొమ్మనహళ్లి ప్రాంతంలో మొత్తం 34 వసతి నిలయాలు ఉన్నాయి. వీటి విలువ సుమారు రూ.11 కోట్లు ఉంటుంది. భార్య పేరు మీద 11 నివాసాలు ఉన్నట్లు ప్రకటించారు. వాటి విలువ రూ.2.56 కోట్లు ఉంటాయన్నారు. బంగారు హనుమంత మొత్తం రుణాలు రూ.2,54,83,569, భార్య రూ.1,35,04,660 ఉన్నట్లు వివరించారు. బంగారు హనుమంతపై ఎలాంటి కేసులు లేవని ప్రకటించారు.

ఎన్నికల పరిశీలన అధికారిణిగా దివ్య ఎస్.అయ్యర్

బళ్లారి: సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నిక సామాన్య పరిశీలన అధికారిగా డా. దివ్య ఎస్.అయ్యర్‌ను నియమిస్తూ ఎన్నిక కమిషన్ ఆదేశాలను జారీ చేసింది. ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై పరిశీలిస్తారని అధికారులు తెలిపారు. సండూరు, హొసపేటెలోని ప్రభుత్వ అతిథి భవనంలో గది నంబరు-1లో అందుబాటులో ఉంటారు. ప్రజలు, రాజకీయ పార్టీల సభ్యులు ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే సోమవారం నుంచి శుక్రవారం వరకు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు వినతి

కంప్లి, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రాంతాల రైతులకు అనుకూలంగా ఉండేందుకు వరి, జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం, హసిరు సేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా పాలనాధికారికి రాసిన వినతిపత్రాన్ని కంప్లిలో తహసీల్దార్‌కు గురువారం సమర్పించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.గౌడ మాట్లాడుతూ అన్ని వస్తువుల ధరలు పెరుగుతున్న నేటి రోజుల్లో రైతు పండించిన పంటలకు మాత్రం గిట్టుబాటు ధర దొరకడం లేదన్నారు. బియ్యం మిల్లుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమయ్య స్వామి, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భరమ రెడ్డి, వి.టి.నాగరాజ్, తాలూకా అధ్యక్షుడు వీరేశ్, పట్టణ శాఖ అధ్యక్షుడు రమేశ్, రంగప్ప, తిమ్మప్ప, మల్లికార్జున పాల్గొన్నారు.

మఠాధీశులతో విజయేంద్ర చర్చ

నేడు నామినేషన్ కార్యక్రమానికి హాజరు



ఉప ఎన్నికలపై చర్చిస్తున్న విజయేంద్ర, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

బళ్లారి, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర గురువారం బళ్లారి నగరంలో పర్యటించారు. విజయేంద్ర బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన ఉదయం నగరానికి చేరుకున్నారు. భాజపా జిల్లాధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా నేతృత్వంలో స్థానిక ఏపీఎంసీ మార్కెట్ వద్ద ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి సిరుగుప్ప రహదారి హవంబావిలోని మాజీ మంత్రి బి.శ్రీరాములు నివాసానికి చేరుకున్నారు. ఇంటి వద్ద మాజీ మంత్రి బి.శ్రీరాములు ఆయన సతీమణి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడే గో పూజ చేసి, గోవుకు పండ్లు, ధాన్యం తినిపించారు. శుక్రవారం జిల్లా సండూరు అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో భాగంగా భాజపా అభ్యర్థి బంగారు హనుమంతు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఒక రోజు ముందే బళ్లారికి చేరుకున్నారు. ఉప ఎన్నికపై మాజీ బి.శ్రీరాములుతో పాటు మాజీ ఎమ్మెల్యేలు గాలి సోమశేఖర్‌రెడ్డి సురేష్‌బాబు, మాజీ లోక్‌సభ సభ్యుడు సణ్ణ పక్కీరప్ప, భాజపా జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకాతో చర్చించారు. అనంతరం కలిసిన విలేకరులతో విజయేంద్ర మాట్లాడుతూ శ్రీరాములు, తమ మధ్య ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేవు. శుక్రవారం తమ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడానికి ఒక రోజు ముందు బళ్లారికి వచ్చాను. నామినేషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. ఇంటింటి ప్రచారం, ఇతర విషయాలపై నేతలతో చర్చించినట్లు తెలిపారు. విజయేంద్రతో పార్టీ నేతలు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు. అక్కడ ఉపాహారం తీసుకుని రోడ్డు మార్గాన సిరుగుప్పకు బయలుదేరి వెళ్లారు.



విజయేంద్రకు పుస్తకం అందజేస్తున్న మాజీ మంత్రి బి.శ్రీరాములు, సతీమణి

ఆరోగ్య రక్షా సమితిలో ఇద్దరు తెలుగువారికి చోటు



ఈడ్పుగంటి గోపి, ఈజే.హొసళ్లి క్యాంపు



కె.శ్రీనివాస్, అరగినమరక్యాంపు

సింధనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ సింధనూరు తాలూకా ప్రభుత్వ ఆసుపత్రికి నూతన 'ఆరోగ్య రక్షా సమితి'ని ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది నామినేటెడ్ సభ్యులుండగా ఈ సమితిలో ఇద్దరు తెలుగు యువకులకు చోటు దక్కింది. ఈజె.హొసళ్లి క్యాంపు వాసి, తాలూకా కమ్మవారి సంఘం సభ్యుడు ఈడ్పుగంటి గోపి, అరగినమర క్యాంపు వాసి కె.శ్రీనివాస్ సభ్యులుగా నియమితులయ్యారు. శరణేగౌడ సాసలమరి, శరణయ్యస్వామి గంగానగర్, గౌరమ్మ సాలగుంద, దుగ్గప్ప పగడదిన్ని, రేణుకమ్మ రాగలపర్వి, బసమ్మ పటేల్‌వాడి తదితరులు ఈ సమితిలో ఇతర సభ్యులు. ఈ సందర్భంగా తెలుగు యువత గోపీ, శ్రీనివాస్‌లను వివిధ క్యాంపుల ప్రజలు అభినందించారు.

పారా స్విమ్మింగ్‌లో దివ్యాంగుల సత్తా

బళ్లారి, న్యూస్‌టుడే: గోవా రాష్ట్రం పనాజీలో ఈ నెల 19 నుంచి 22 వరకు జరిగిన జాతీయ స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలో బళ్లారి జిల్లాకు మొత్తం ఏడు పతకాలు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పలువురు అభినందించారు. బళ్లారి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈత పోటీల్లో సాయి నిఖిల్, గోపిచంద్, బేబి సాయి, కవిత పాల్గొన్నారు. వారిలో వివిధ విభాగ పోటీల్లో సాయి నిఖిల్ 1 స్వర్ణం, 2 కాంస్య పతకాలు సాధించారు. గోపీచంద్ 3 రజత పతకాలు, బేబి సాయి 1 రజతం, కవిత 2 కాంస్యం పతకం సాధించినట్లు స్విమ్మింగ్ కోచ్ రజనీ లక్కా తెలిపారు. దివ్యాంగులకు రజనీ లక్క, శరత్ గైక్వాడ్ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్యారా జాతీయ స్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన క్రీడాకారులను ఎమ్మెల్యేలు బి.నాగేంద్ర, నారా భరత్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్, ఎస్పీ శోభారాణి తదితరులు అభినందించారు.





ఈతలో విజేతగా నిలిచిన దివ్యాంగులు

హొసపేటెలో న్యాయశాస్త్ర కళాశాల

వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె డిగ్రీ విద్యార్థులకు శుభవార్త. చాలా ఏళ్ల నుంచి డిగ్రీ విద్యార్థులు అడుగుతున్న న్యాయ కళాశాల (లా కాలేజ్)ను విజయనగర జిల్లా కేంద్రం హొసపేటెలో ప్రారంభించటానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి న్యాయశాస్త్ర కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. పట్టణ పరిధి అమరావతిలో ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే ఓ భాగంలో వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా న్యాయ కళాశాలను ప్రారంభిస్తారు. డిగ్రీ కళాశాలలో న్యాయ కళాశాల ప్రారంభానికి కావాల్సిన వాతావరణం, గదులు ఇతర మౌలిక సదుపాయాలపై వెంటనే నివేదిక ఇవ్వాలని కళాశాల విద్యా సంచాలకుడు, కలబురగి సంయుక్త సంచాలకుడికి సూచనలు ఇచ్చారు. అధికారి సహా, విజయనగర జిల్లా పాలనాధికారి న్యాయ కళాశాల ప్రారంభానికి కావాల్సిన సదుపాయాలపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించారు. ప్రస్తుతం హొసపేటె పట్టణంలో 15దాకా డిగ్రీ కళాశాలలు ఉన్నా. మిగిలిన ఐదు తాలూకాల్లో మరో పది డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఏటా డిగ్రీ పూర్తి చేసుకున్న వందల సంఖ్యలో విద్యార్థులు న్యాయశాస్త్రం చదవాలంటే బళ్లారిలో ఉన్న ప్రైవేటు కళాశాలలకు వెళ్తున్నారు. ఈ వెలితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇక్కడ న్యాయశాస్త్ర కళాశాలను మంజూరు చేసింది. బళ్లారి, కొప్పళ, రాయచూరు జిల్లాల్లో కూడా ప్రభుత్వ న్యాయ కళాశాల లేవు. ఇక్కడ ప్రారంభమైతే నాలుగు జిల్లాల్లో లా చదవాలనుకునే విద్యార్థులకు ఎంతో వెసలుబాటు కలగనుంది. వచ్చే ఏడాది డిగ్రీ కళాశాలలో తాత్కాలికంగా లా కాలేజీ ప్రారంభించి, సొంత భవనం నిర్మాణానికి చర్యలు చేపడతారు.



పట్టణంలోని అమరావతిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల. ఇందులో లా కళాశాల ప్రారంభించనున్నారు

విద్యుదాఘాతంతో నర్సు మృతి

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: విద్యుత్తు తీగ తాకడంతో భవనం పైనుంచి కిందపడి ప్రైవేటు నర్సింగ్ హోంలో పనిచేస్తున్న నర్సు, మొళకాల్మూరు తాలూకా చిక్కోబనహళ్లి గ్రామానికి చెందిన ఇంద్రమ్మ (36) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి జరిగిందని పోలీసులు తెలిపారు. గురువారం వారు అందించిన వివరాల మేరకు.. ఇంద్రమ్మ 12 సంవత్సరాలుగా ఇక్కడ నర్సుగా పనిచేస్తూ అక్కడే పై అంతస్తు గదిలో నివాసం ఉంటున్నారు. తోటి నర్సు కోరడంతో ఆమె మందుల గది తాళం చెవులను పైన నుంచి కిందకు విసిరినప్పుడు నర్సింగ్ హోం ముందు ఉన్న విద్యుత్తు తీగలకు చిక్కుకొన్నాయి. వెంటనే ఇంద్రమ్మ ఇనువ చువ్వను తీసుకొని తాళం చెవులను తొలగించడానికి ప్రయత్నించింది. దీంతో ఆమె విద్యుదాఘాతానికి గురై భవనం పై నుంచి కిందకు పడి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించే లోపు తుదిశ్వాస వదిలారని పోలీసులు తెలిపారు.

చందనపు దుంగల చోరీ

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొసదుర్గం తాలూకా బీసనహళ్లి గ్రామానికి చెందిన జగదీశ్ పొలంలో పెంచిన 10 శ్రీ గంధం చెట్లను బుధవారం రాత్రి దుండగులు రంపాలతో కోసుకొని దుంగలను పరారైనట్లు పోలీసులు తెలిపారు. గురువారం వారు తెలిపిన వివరాల మేరకు.. రైతు జగదీశ్ 13 సంవత్సరాల క్రితం తన పొలంలో 350 శ్రీ గంధం చెట్లను నాటి పెంచుతున్నారు. చందనపు చెక్కలపై కన్ను వేసిన దుండగులు రాత్రి వాహనాల్లో వచ్చి 10 చెట్లను పూర్తిగా కోసి మరో 30 చెట్లను సగానికి నరుక్కొని తరలించుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదుతో హొసదుర్గం పోలీసులు విచారణ చేపట్టారు.

మరకుంబి దళితులపై దౌర్జన్యం

98 మందికి యావజ్జీవ శిక్ష

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి తాలూకా మరకుంబి గ్రామంలో దళితులపై దాడులు, దౌర్జన్యానికి సంబధించి 98 మందికి యావజ్జీవ శిక్ష ప్రకటిస్తూ కొప్పళ జిల్లా న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ నెల 21న విచారణ పూర్తిచేసి తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం గురువారం దీన్ని ప్రకటించింది. 2014లో గంగావతి పట్టణంలో సినిమా టికెట్ల విషయంలో గొడవ చోటు చేసుకుంది. ఈ గొడవ గ్రామానికి పాకి అక్కడ దళితులు, అగ్రవర్ణాల మధ్య అల్లర్లు జరిగాయి. దళితుల గుడిసెలకు నిప్పంటించి కాల్చివేశారు. అప్పట్లో 117 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో కొందరు మృతి చెందారు. 101 మందిలో 98 మందికి సుదీర్ఘ విచారణ తరువాత యావజ్జీవ శిక్ష, తలా రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి చంద్రశేఖర్ తీర్పు ఇచ్చారు. మిగిలిన ముగ్గురు దళితులు కావడం వారికి అట్రాసిటీ కేసు అన్వయించనందున ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. నిందితులు అందరినీ బళ్లారి జైలుకు తరలించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

మాన్వి, న్యూస్‌టుడే : స్థానిక కళాకారులను ప్రోత్సహించాలని, తద్వారా వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని సంఘ సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. తాలూకాలోని తమ్మాపుర గ్రామానికి చెందిన యువ నటుడు మహిన్ కుబేర్ నటించిన చలన చిత్రాన్ని ఈ నెల 25న అపర్ణ చిత్రమందిరంలో విడుదల చేస్తున్న క్రమంలో సంఘ సంస్థల సంచాలకులు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మహిన్ పలు ధారావాహికలు, చలన చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించి ప్రజల అభిమానాన్ని చొరగొన్నాడని పేర్కొన్నారు. ఆరేళ్లుగా రంగభూమి కళాకారుడిగా రాణిస్తున్న మహిన్ ప్రధాన పాత్రలో నటించిన ప్రకరణ తనిఖా హంతదల్లిదె (కేసు దర్యాప్తు దశలో ఉంది) సినిమా పట్టణంలో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు సినిమా చూసి స్థానిక కళాకారుడుని ప్రోత్సహించాలని కోరారు. ప్రభురాజ్ కొడ్లి, ప్రవీణ్‌కుమార్, బుడ్డప్పనాయక్, హనుమేష్ మద్లాపూర్, చిదానందస్వామి, హనుమంతరాయ, శంకర్‌నాయక్ తమ్మాపుర్, సిద్ధరామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా - ప్రయాణికురాలి మృతి

20 మందికి గాయాలు

హొసపేటె, న్యూస్‌టుడే: చోదకుడి అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు రహదారి పక్కనే ఉన్న గోతిలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన మహిళ ప్రయాణికురాలు హనుమక్క (45) అక్కడికక్కడే మృతి చెందింది. మరో 20 మంది కి గాయాలయ్యాయి. ఈ ఘటన హరపనహళ్లి తాలూకా సూత్తూరు వద్ద గురువారం జరిగింది. మృతురాలిని సుత్తూరు వాసిగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులూ హరపనహళ్లి తాలూకాకు చెందిన వారు. వారందరినీ హరపనహళ్లి, దావణగెరె బాపూజీ ఆసుపత్రుల్లో దాఖలు చేశారు. దావణగెరె నుంచి హరపనహళ్లి వైపు వస్తున్న సమయంలో ఈ దుర్ఘటన జరిగింది. ఆ సమయంలో బస్సులో పాతికమంది ప్రయాణికులు ఉన్నారు. అరసీకెరె పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.



గోతిలో బోల్తాపడిన ఆర్టీసీ బస్సు



మృతిచెందిన హనుమక్క

తప్పుడు సాక్ష్యం చెప్పినందుకు శిక్ష

గంగావతి,న్యూస్‌టుడే: ఫిర్యాదు చేసిన వ్యక్తి తప్పుడు సాక్ష్యం చెప్పి నిందితులను కాపాడే ప్రయత్నం చేసినందుకు కొప్పళ న్యాయస్థానం శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ప్రభుత్వ న్యాయవాది కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. కొప్పళ జిల్లా బిసరళ్లికి చెందిన చిదానందయ్య అనే వ్యక్తి తమ భూమికి చెందిన దాఖలాలు చేసి ఇచ్చేందుకు గ్రామలెక్కాధికారి రూ.5వేలు లంచం కోరినట్లు లోకాయుక్త పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామ లెక్కాధికారి రవిశెట్టి లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. లోకాయుక్త పోలీసులు దీనికి సంబంధించిన అభియోగపత్రం సమర్పించారు. సాక్ష్యుల విచారణ సమయంలో చిదానందయ్య తాను ఇచ్చిన ఫిర్యాదుకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పడంతో నిందితులను విడుదల చేశారు. దీనిపై లోకాయుక్త పోలీసులు ధార్వాడ హైకోర్టు పీఠంలో దావా వేశారు. హైకోర్టు నిందితులు నేరానికి పాల్పడినట్లు నిర్ధారించి తీర్పు చెప్పి శిక్ష ప్రకటించింది. తప్పుడు సాక్ష్యం చెప్పిన చిదానందయ్యపై విచారణ చేపట్టి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కొప్పళ జిల్లా న్యాయస్థానాన్ని ఆదేశించింది. జిల్లా సెషన్స్ న్యాయమూర్తి మలకారి రామప్ప ఒడెయర్ సాక్ష్యాధారాల ఆధారంగా చిదానందయ్యకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ప్రభుత్వ న్యాయవాది వసంత్ తెలిపారు.

నవంబరు కలబురగి చలో 9న



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ కేంద్ర సమితి సభ్యుడు అమరేశ్ కడగద్

హొసపేటె, న్యూస్‌టుడే: కల్యాణ కర్ణాటక ప్రాంతంలో ఖాళీగా ఉన్న సుమారు 14వేల ఉపాధ్యాయుల స్థానాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతృత్వంలో నవంబరు 9న కలబురగి చలో కార్యక్రమాన్ని చేపట్టామని విద్యార్థి సంఘం కేంద్ర సమితి సభ్యుడు అమరేశ్ కడగద్ పేర్కొన్నారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలో 371(జె)జారీలోకి వచ్చి సుమారు 10 ఏళ్లవుతోంది. ఇప్పటివరకు 6 వేల ఉపాధ్యాయులను మాత్రమే నియమించారు. అయినప్పటికీ ఇంకా 14 వేల స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి 25:1 ఉండాలి. ఇక్కడ 50మంది విద్యార్థులకు ఒకరు ఉపాధ్యాయుడు ఉన్నారని విచారం వ్యక్తం చేశారు. పరిషత్తు రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొడ్డబసవరాజ్ గుళేదాళ్, జిల్లా కార్యదర్శి శివారెడ్డి, పవన్‌కుమార్, శారదా, స్వామి పాల్గొన్నారు.

సోహన్ ఎవరెస్టును అధిరోహించెన్

మాన్వి, న్యూస్‌టుడే : పట్టణానికి చెందిన చుండ్రు సోహన్‌కుమార్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు. నిర్మాణ రంగ ప్రముఖుడు చుండ్రు సూరిబాబు, స్వాతి దంపతుల పెద్ద కుమారుడు సోహన్ అక్టోబర్ 20న పర్వతాన్ని ఎక్కాడు. వాటికి సంబంధించిన ఛాయా చిత్రాలను కుటుంబ సభ్యులతో పంచుకున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మాన్వి, పీయూసీ బెంగళూరులో చదివిన సోహన్, ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. సిద్ధార్థ త్రిపాఠి ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థుల బృందం అక్టోబర్ 11న గన్నవరం నుంచి బయలుదేరి వెళ్లారు. హిమాలయం ఎవరెస్టు శిఖర బేస్ క్యాంప్‌ను నిర్వహించారు. బేస్ క్యాంప్ ద్వారా ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించి సోహన్‌కుమార్ బృందం రికార్డు నెలకొల్పింది. హిమాలయాన్ని అధిరోహించిన దేశంలోని తొలి ప్రైవేట్ కళాశాల విద్యార్థుల బృందం ఇదేనని నిర్వాహకులు వెల్లడించారు. పట్టణానికి చెందిన విద్యా సంస్థల నిర్వాహకులు, సంఘ సంస్థలు హర్షం వ్యక్తం చేశారు.



ఎవరెస్ట్‌పై జెండాను ప్రదర్శిస్తున్న చుండ్రు సోహన్‌కుమార్

సామూహిక వివాహాలతో ఉత్తమ సమాజ నిర్మాణం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీశైలం, ఉజ్జయిని, కాశీ పీఠాధిపతులు, బి.వై.విజయేంద్ర తదితరులు

సిరుగుప్ప, న్యూస్‌టుడే: సామూహిక వివాహాల్లో పాల్గొని వివాహం చేసుకుంటే ఆదర్శ జీవనం సాగించవచ్చని శ్రీశైలం, కాశీ, ఉజ్జయిని పీఠాధిపతులు ఆశీర్వచనం చేశారు. పట్టణంలోని పినాకి ఆశ్రమంలో గురువారం శ్రీశైల పీఠం ఆధ్వర్యంలో రూ.8 కోట్లతో నిర్మించిన శివశక్తి సాంస్కృతిక భవనం ప్రారంభోత్సవం, ఉచిత సామూహిక వివాహ కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీశైలం, ఉజ్జయిని, కాశీ మఠాలకు చెందిన జగద్గురువులు డా.చన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య, సిద్ధలింగ రాజదేశికేంద్ర శివాచార్య, డా.మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య పీఠాధిపతులు ప్రారంభోత్సవ, సామూహిక వివాహాల కార్యక్రమానికి సాన్నిధ్యం వహించారు. నేడు వివాహాలు అంటే ఆడంబరానికి చిరునామాగా మారాయి. ఎంతో ఖర్చుతో కూడుకుని సామాన్యులకు ఆర్థికంగా భారం అవుతోంది. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని వివాహం చేసుకుంటే నూతన జంటలు ఆదర్శ జీవనం సాగించవచ్చని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు బి.వై.విజయేంద్ర పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో మఠాలు అన్ని వర్గాల ప్రజలను ఆదరించి మఠాల్లో అన్నదానం, విద్యాదానం, జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలను అందిస్తూ ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తూ దేశంలోనే కర్ణాటక రాష్ట్రం ఆదర్శంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాయన్నారు. వీటికి తోడు ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా కల్యాణ మండపం నిర్మించి లోకార్పణం చేయడం, ఉచిత సామూహిక వివాహాలు చేసి మరింత మెరుగు తేవడం సంతోషించదగ్గ విషయమన్నారు. సిరుగుప్ప-బళ్లారి రహదారి గుంతలమయమై అధ్వానంగా ఉంది, నూతన వధూవరులు ద్విచక్ర వాహనంపై వెళ్తే వెనుక భార్య ఉందో లేదో చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తెక్కెలకోట కంబాళి మఠం మఠాధిపతి వీరభద్ర శివాచార్య స్వామి అధ్యక్షత వహించారు. ఆయా మఠాలకు చెందిన నాగభూషణ స్వామి, మహంత శివాచార్య స్వామి, మల్లికార్జున శివాచార్య స్వామి, వామదేవ శివాచార్య స్వామి, జమఖండి శాసనసభ్యుడు జగదీశ్ గుండుగుంటి మఠ, పార్లమెంటు మాజీ సభ్యుడు కరడి సంగణ్ణ, మాజీ శాసనసభ్యులు టి.ఎం.చంద్రశేఖరయ్య స్వామి, ఎం.ఎస్.సోమలింగప్ప, గాలి సోమశేఖరరెడ్డి, పికార్డ్ బ్యాంకు అధ్యక్షుడు చొక్కా బసవనగౌడ, వీరశైవ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.



సామూహిక వివాహాల్లో పాల్గొన్న నూతన వధూవరులు

బళ్ళారి

•బళ్ళారి •రాయచూరు

వంతెనపై చిన్న వాహనాలకు అనుమతి


కంప్లి కోటె వంతెనపై చేరిన చెత్త

కంప్లి, న్యూస్‌టుడే: తుంగభద్ర వరద ప్రవాహం తగ్గడంతో కంప్లి కోటె వంతెనపై గురువారం చిన్న వాహనాల రాకపోకలను అనుమతించారు. ఉదయం వంతెనపై ద్విచక్ర వాహనాలు మాత్రం సంచరించాయి. మధ్యాహ్నం నుంచి ఆటోలు, కార్లు వంటి చిన్న వాహనాలను అనుమతించారు. వరద ప్రవాహానికి కొట్టుకువచ్చిన చెత్త వంతెనపై అలాగే ఉండిపోయింది.

బాలుర సంక్షేమ నిలయం తనిఖీ

సింధనూరు, న్యూస్‌టుడే: విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి గురువారం స్థానిక కుష్టిగి మార్గంలోని వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాక హైస్కూలు విద్యార్థుల సంక్షేమ వసతి నిలయాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థుల వెతలు ఆలకించారు. స్నానాల గదులు సవ్యంగా లేవని, నీటి సమస్య తలెత్తిందని, వండి పెట్టే వంటకాలు అస్సలు రుచికరంగానే ఉండవన్నారు. వృథా నీరు సవ్యంగా ముందుకు పారక నిత్యం దుర్వాసన వెదజల్లే పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు హాస్టల్ విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. వెనుకబడిన వర్గాల వసతి నిలయం వార్డెన్‌ను పిలిచి మాట్లాడారు. అనంతరం వారం రోజుల్లో మీ సమస్యలకు పరిష్కారం చూపిస్తానని బసనగౌడ విద్యార్థులకు హామీ ఇచ్చారు.


హాస్టల్లో విద్యార్థుల పడక గదులను చూస్తున్న ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

కాంతరాజు నివేదిక బహిర్గతపరచాలి



మినీవిధాన సౌధ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న రిజర్వేషన్ సంరక్షణ సమాఖ్య నాయకులు

సింధనూరు, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు రిజర్వేషన్ ప్రక్రియ పనిని రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేసింది కదా..అని ప్రభుత్వం కళ్లు మూసుకుని ఎస్సీ వర్గీకరణను జరిపితే ఇందులో 101 సమాజాల ప్రజలు అన్యాయం అయిపోతారు. అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కాంతరాజు నివేదికను బయటకు తేవాలని కర్ణాటక రిజర్వేషన్ సంరక్షణ సమాఖ్య నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సింధనూరులో గురువారం నిరసన ప్రదర్శన జరిపారు. ఇందులో కొరమ, కొరచి, భోవి, వడ్డర, లమాణీ సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు. నిపుణుల సలహాలు తీసుకోకుండా ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకేసినా ఊరుకోం అని హెచ్చరించారు. ప్రముఖులు రామకృష్ణ భజంత్రీ, రవి రాథోడ్, వీరేశ్ భోవి తదితరులు పాల్గొన్నారు.

కుల వర్గీకరణపై మీనమేషాలా

హొసపేటె, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని విజయనగర మాదిగ మహాసభ జిల్లాధ్యక్షుడు వీరస్వామి హెచ్చరించారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల కుల వర్గీకరణను అమలు చేయవచ్చని అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వానికి సూచనలు ఇచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని ఆరోపించారు. అధికారంలోకి వస్తే తప్పకుండా ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. కులాలవారి సమీక్ష వివరాలను ఎప్పుడైనా వెల్లడించండి, ఎస్సీ వర్గీకరణను మాత్రం వెంటనే అమల్లోకి తీసుకురావాలన్నారు. లేకపోతే అసలైన దళితులకు విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అన్యాయం జరుగుతుందని వాపోయారు. ఈ నెల 28న జరిగే మంత్రివర్గ సమావేశంలో తగిన నిర్ణయాలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు. మహాసభ ప్రముఖులు శేషు, బసవరాజ్, భరత్‌కుమార్ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ మహాసభ జిల్లాధ్యక్షుడు వీరస్వామి

కార్మికుల సమస్యలపై పోరాడతాం

● నవంబరు 23 నుంచి జిల్లా సమ్మేళనం

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి నగరం గాంధీ భవనంలో సీపీఐ (ఎం) తాలూకా సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పార్టీ సభ్యులు శివశంకర్, చంద్రకుమారి, సత్యబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ సీపీఐ (ఎం) మొదటి నుంచి కార్మికులు, రైతులు, మహిళల సమస్యలపై పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. కుడతిని చుట్టుపక్కల గ్రామాల్లో పరిశ్రమల కోసం 12,500 ఎకరాల వ్యవసాయ భూమిని స్వాధీనం చేసుకుని నేటి వరకు పరిశ్రమలు స్థాపించ లేదు. మద్దతు ధర ఇవ్వకపోవడంతో 670 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. వారికి పార్టీ పూర్తిగా మద్దతు ప్రకటించిందన్నారు. అనంతరం సీపీఐ (ఎం) తాలూకా కార్యదర్శిగా చంద్రకుమారి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాండు రంగరాజ, మూర్తి, యర్రిస్వామి, ఈరమ్మ, రాణి, ఎర్రిస్వామి, పెద్దన్న పత్తార్, వేదావతి తదితరులు సభ్యులుగా ఎంపికయ్యారు. నవంబరు 23 నుంచి రెండు రోజులపాటు సిరుగుప్పలో జిల్లా సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న శివశంకర్

ఉప ఎన్నికల్లో నిబంధనల ఉల్లంఘన

బళ్లారి: సండూరు నియోజకవర్గం ఉప ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఎనిమిది కేసులు నమోదు చేసినట్లు జిల్లా పాలనాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. తాలూకాలో అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న వారిపై అబ్కారీ అధికారులు, సిబ్బంది దాడి చేసి 2616.93లీటర్ల మద్యం (రూ.7,76,648 విలువ) స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులు దాడి చేసి రూ.640 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సండూరు ఉప ఎన్నికల్లో ఎన్నికల నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్లు, నాలుగు అబ్కారీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వసుధేంద్ర తీర్థ ఉత్తరారాధన



సిరుగుప్ప, న్యూస్‌టుడే: వసుధేంద్ర తీర్థ ఉత్తరారాధన ఉత్సవాన్ని వైభవంగా ఆచరించారు. కెంచనగుడ్డ పరిధిలో తుంగభద్ర తీరాన ఉన్న శ్రీ వసుధేంద్ర తీర్థ మూల బృందావనంలో గురువారం ఉత్తరారాధనను పురస్కరించుకుని ఉదయం మూల బృందావనంలో పూజలు, అభిషేకాలు, మహా మంగళారతి, అలంకరణ, లోకకల్యాణార్థం ధన్వంతరి హోమం, కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు.

అలంకరణలో శ్రీ వసుధేంద్ర తీర్థ బృందావనం

భార్య హత్య కేసులో భర్తకు యావజ్జీవ శిక్ష

గంగావతి,న్యూస్‌టుడే: భార్య శీలంపై అనుమానంతో ఆమెను హత్యచేసిన నిందితుడికి గంగావతి అదనపు జిల్లా న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. గంగావతి తాలూకా విఠలాపుర గ్రామంలో 2018లో ఈ సంఘటన జరిగింది. దురుగేశ్ కరెకల్ అనే వ్యక్తి పుట్టింటికి వచ్చిన భార్యను కత్తితో గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. అప్పట్లో గంగావతి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ దీపక్ బూసరెడ్డి కేసు దర్యాప్తు చేసి న్యాయస్థానానికి అభియోగపత్రం సమర్పించారు. నేరం రుజువు కావడంతో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.4,50,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సదానంద నాయ్క తీర్పు ఇచ్చారు. బాధితురాలి కుటుంబం తరపున ప్రభుత్వ న్యాయవాది ఎస్.నాగలక్ష్మీ వాదించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హొసపేటె, న్యూస్‌టుడే: కూడ్లిగి తాలూకా బణవికల్లు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కానాహొసహళ్లి పోలీసులు గుర్తించారు. మట్టిలో సగం పూడ్చిన స్థితిలో ఉన్న శవాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపైన నీలంరంగు టీషర్టు, నల్లరంగు ప్యాంటు ఉంది. ఆ వ్యక్తికి 40 ఏళ్లుంటాయని కేసు నమోదు చేసుకున్న కానాహొసహళ్లి పోలీసులు తెలిపారు.

ఉపాధి హామీ పథకం పేదలకు వరం

చెళ్లూరు కాంపు (కారటగి), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కారటగి తాలూకా పంచాయతీ, చెళ్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెళ్లూరు గ్రామ పంచాయతీ పరిధి చెళ్లూరు క్యాంపులో ఇంటింటికీ వెళ్లి ఉపాధి హామీ కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధి పథకం కింద ఏడాదిలో వంద రోజుల పని కల్పిస్తారన్నారు.. రోజుకు రూ.349 కూలి ఇస్తారు. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

హొసపేటె, న్యూస్‌టుడే: హొసపేటె రైల్వేస్టేషన్ ప్రాంతం నుంచి గంగమ్మ (35) అనే మహిళ అదృశ్యమైనట్లు చిత్తవాడ్గీ పోలీస్‌ఠాణాలో కేసు నమోదైంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగిరాలేదు. అన్నిచోట్లా వెతికిన కుటుంబ సభ్యులు చివరికి పోలీసులను ఆశ్రయించారు. అదృశ్యమైన మహిళ 5.2 అడుగుల ఎతుండి కన్నడ, తెలుగు, హిందీ భాషలను మాట్లాడుతోంది. ఆచూకీ తెలిసినవారు వెంటనే ఠాణాలో సమాచారం అందివ్వాలని పోలీసులు కోరారు.

పౌష్టికత పిల్లల ప్రాథమిక హక్కు

గంగావతి,న్యూస్‌టుడే: పౌష్టికత చిన్న పిల్లల ప్రాథమిక హక్కని కొప్పళ నగర సభ అధ్యక్షుడు అంజద్ పటేల్ పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రచార శాఖ బళ్లారి కేంద్రం గురువారం కొప్పళలో పోషణ్ అభియాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిన్నపిల్లలు దేశ సంపద అంటూ వారికి పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పౌష్టికత పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతమైన పిల్లలను సమాజానికి అందించాలన్నారు. సమాచార శాఖ అధికారి ఎన్.రామకృష్ణ, మహిళా, శిశు సంక్షేమశాఖ ఉప సంచాలకులు పరశురామ్ శెట్టప్పనవర్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి శివానంద పూజార్ పాల్గొన్నారు.



కొప్పళలో మాట్లాడుతున్న నగరసభ అధ్యక్షుడు అంజద్ పటేల్

వాల్మీకి సముదాయ భవనం ప్రారంభం

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లిలో మహర్షి వాల్మీకి సముదాయ భవనం గురువారం ప్రారంభమైంది. అంతకుముందు వాల్మీకి కూడలిలో వాల్మీకి నామఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉద్భవ గణపతి ఆలయం నుంచి వాల్మీకి చిత్రపటాన్ని ఊరేగించారు. మేళతాళాలు, మహిళలు పూర్ణ కుంభాలతో వెంట రాగా ఊరేగింపు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నూతన సముదాయ భవనం వరకు సాగింది. అక్కడ జరిగిన సమావేశానికి రాజనహళ్లి వాల్మీకి గురుపీఠ ప్రసన్నానంద పురి స్వామీజీ సాన్నిధ్యం వహించారు. శాసనసభ్యుడు గణేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు బి.నారాయణప్ప, రామాంజనేయులు, డాక్టర్ వెంకటేశ్ బరమక్కనవర్, హేమయ్య స్వామి, కె.శ్రీనివాస రావు, నీరగంటి వీరేశ్, పురసభ సభ్యులు, వాల్మీకి సముదాయ నాయకులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న వాల్మీకి సముదాయ నాయకులు తదితరులు

జిల్లా అభివృద్ధి పుంజుకోవాలి

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా ఏర్పడి మూడేళ్లవుతోంది. ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదు, అధికారులు నిద్రమత్తువీడి జిల్లాభివృద్ధికి కృషి చేయాలని పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్ సూచించారు. గురువారం ఇక్కడ ఏర్పాటు చేసిన ఎస్సీ పథకం (ఎస్సీపీ), ఎస్టీ ఉప పథకం (టీఎస్పీ) ప్రగతి పరిశీలన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజనులకు కేటాయించిన నిధులు సద్వినియోగం కావాలి. ఆ వర్గాల్లో చివరి వ్యక్తికి కూడా పథకాలు అందాలని తెలిపారు. ఎస్సీపీ, టీఎస్పీలో వ్యవసాయ శాఖకు రూ.2.83 కోట్లు విడుదలయ్యాయి. అందులో రూ.2.77 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. పర్యాటక శాఖ నుంచి 8 నుంచి 10వ తరగతి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కర్ణాటక దర్శన ప్రవాసం ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని సంబంధిత అధికారిపై పాలనాధికారి కన్నెర్ర చేశారు. ప్రజలకు లేనిపోని సాకులు చెప్పి పథకాలను నీరుగార్చకూడదని హెచ్చరించారు. జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్.మొహ్మద్ అలి అక్రం షా పాల్గొన్నారు.


అధికారులకు సూచనలు చేస్తున్న పాలనాధికారి ఎం.ఎస్.దివాకర్. జడ్పీ సీఈవో మహ్మద్ అలి అక్రం షా

మహాత్ముడి జీవితమే ఓ మహా పుస్తకం


విద్యార్థినులకు మహాత్మాగాంధీ జీవితచరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే, వర్సిటీ వీసీ

హొసపేటె, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీజీ జీవితమే ఓ మహా పుస్తకమని స్థానిక శాసనసభ్యుడు హెచ్.ఆర్.గవియప్ప పేర్కొన్నారు. హంపీ కన్నడ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల సంఘం, తాలూకా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో 'గాంధీజీ జీవితాన్ని చదువు' అనే అంశంపై గురువారం బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయన ఆదర్శాలు, విలువలు, సిద్ధాంతాలు ఎప్పటికీ అనుసరణీయం. ఆయన అడుగు జాడల్లో వెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే మహా గౌరవమని పేర్కొన్నారు. గాంధీజీ మంచి వక్త, పాత్రికేయుడని గుర్తు చేశారు. ఆయన ఆధ్వర్యంలో హరిజన అనే పత్రిక వెలువడేది అని వివరించారు. హంపీ కన్నడ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.వి.పరమశివమూర్తి మాట్లాడుతూ..అహింసా అనే ఆయుధంతో దేన్నైనా సాధించవచ్చని చూపించిన మహావ్యక్తి గాంధీజీ అని అభివర్ణించారు. తాలూకా విద్యాశాఖ అధికారి ఎం.చెన్నబసప్ప, బాలికల కళాశాల ఉపప్రధానాచార్య వెంకటేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినులకు గాంధీజీ జీవితచరిత్ర పుస్తకాన్ని పంపిణీ చేశారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.94	1610.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	97,751	508
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	96,487	9,790
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	38.648

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

చెరువులో మునిగి మావటీ మృతి

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనంలోని చెరువులో మునిగి గోపాల్ (24) అనే మావటీ మరణించారు. పదేళ్ల వయసున్న సంపత్ అనే ఏనుగును గురువారం చెరువులో నిలిపి శుభ్రం చేస్తున్న సమయంలో అది భయపడి నీటి మధ్యలోకి వెళ్లింది. దాన్ని నియంత్రించే ప్రయత్నంలో గోపాల్ నీటి మధ్యలోకి వెళ్లి తిరిగి రాలేకపోయారు. రెండు గంటలు గాలింపు చేపట్టి మృతదేహాన్ని వెలికి తీశారు. బన్నేరుఘట్ట ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మారణాయుధాలతో దాడి

మైసూరు, న్యూస్‌టుడే : తిరుమలకుడ్లు నరసీపుర పట్టణ భగవాన్ టాకీస్ కూడలిలో దినకర్ (28) అనే యువకుడిపై అపరిచితులు మారణాయుధాలతో గురువారం దాడి చేసి పరారయ్యారు. ముసుగులు ధరించి బైకులపై వచ్చిన ఆగంతకులు అతనిపై దాడి చేసి పరారయ్యారు. రక్తం మడుగులో పడి ఉన్న దినకర్‌ను చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. టి.నరసీపుర ఠాణా పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రక్షకభటుడికి కటకటాలు

మడికేరి : తన ప్రేయసి ఆయేషా (29) భర్త ఇర్ఫాజ్ (32)ను హత్య చేసేందుకు ప్రయత్నించిన ఆరోపణలపై కొత్రేష్ అనే కానిస్టేబుల్‌ను శనివారసంతె ఠాణా పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కొత్రేశ్- ఆయేషా ఇరుగుపొరుగు ఇళ్లలో ఉండేవారు. వారిద్దరి మధ్య స్నేహం వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయాన్ని ఇర్ఫాజ్ గుర్తించారు. దీంతో అతన్ని హత్య చేసేందుకు వీరిద్దరూ విఫలయత్నం చేశారు. శనివారసంతె ఠాణా పోలీసులు కేసు నమోదు చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడంతో కొడగు ఎస్పీ రామరాజన్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసుకుని కొత్రేష్, ఆయేషాలను అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

మరో నిందితుడి ఆటకట్టు

బెళగావి, న్యూస్‌టుడే : భూవ్యాపారి సంతోశ్ పద్మణ్ణవర హత్య కేసులో మంజునాథ్ తర్కల్ అనే నిందితుడ్ని మాళమారుతి ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. సంతోశ్ భార్య సరితా అలియాస్ ఉమ, శోభిత్ గౌడ, పవన్‌లను ఇప్పటికే అరెస్టు చేశారు. దీంతో ఇప్పటి వరకు అరెస్టయిన నిందితుల సంఖ్య నాలుగుకు చేరుకుంది. అక్టోబరు 9న సంతోశ్ మరణించగా, తన తండ్రి హత్య వెనుక తల్లి పాత్ర ఉందంటూ వారి కుమార్తె ఫిర్యాదుతోనే హత్య విషయం బయట పడిన విషయం తెలిసిందే.

యువకుడు సముద్రంపాలు

మంగళూరు, న్యూస్‌టుడే : సూరత్కల్ సమీపంలోని రెడ్‌రాక్ బీచ్‌లో సముద్రపు అలలతో ఆడుకుంటూ ప్రజ్వల్ (21) అనే యువకుడు నీట మునిగి మరణించాడు. బాధితుడు బంట్వాళ తాలూకా బీసీ రోడ్డు నివాసి. తన ఎనిమిది మంది స్నేహితులతో వచ్చిన నీటి వద్ద ఆడుకుంటూ ప్రజ్వల్ సముద్రపు నీటిలో మునిగిపోయాడు.

కన్నడ ఫలకానికి అవమానం


శివాజీనగర : కర్ణాటకలో అన్ని వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, శాఖలు కన్నడలోనే ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. బెండిగానహళ్లిలో కన్నడ కవుల పేరిట ఏర్పాటు చేసిన ఫలకాన్ని కొందరు తొలగించి, కిందపడేసి అక్కడ నృత్యాలు చేసి పరారయ్యారు. ఈ ఘటన స్థానిక సీసీ కెమెరాలో నమోదైంది. గ్రామపంచాయతీ, స్థానికుల అనుమతి తీసుకుని ఏర్పాటు చేసిన బోర్డును తీసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కన్నడ పోరాట సంఘాల నేత రూపేశ్ రాజణ్ణ డిమాండ్ చేశారు. ఇతర సంఘాల ప్రతినిధులతో కలిసి మళ్లీ బోర్డును గురువారం ఏర్పాటు చేశారు.


ప్రదర్శనాలయం.. 'భవన' మోహనం!


● ఆ'పాత' వైభవాలివిగో

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : పాత ఓ రోత.. కొత్త ఓ వింత అనేది పాత నానుడి. అలనాటి.. ఆపాత మధురాలనే ఉత్సాహం నేటి వ్యవహారంగా మారింది. చారిత్రక నిర్మాణాలు, వస్తువులు, వేదికల వివరాలు తెలుసుకునేందుకు పర్యాటకులతో పాటు యువతరం ప్రతినిధులూ ఆసక్తిచూపుతారనేందుకు ఉడుపి సమీప వస్తు ప్రదర్శన నిదర్శనం. పురాతనమైన గృహాలు, అప్పటి శిల్పకారులు చెక్కిన కొయ్య వస్తువులు, కంచు- మట్టి కుండలు, తిరగళ్లు, లాంతర్లు, గోడ గడియారాలు, చెక్క బల్లలు అసనాలు, గుర్రపు బండ్లు, మంచాలు కంచాలు ఇలా పురాతనమైన వస్తువులతో కూడిన 'హస్త- శిల్ప ప్రాచీన వస్తు ప్రదర్శనశాల' దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనశాల యునెస్కో జాబితాలో చేర్పించే ప్రయత్నాలను రాష్ట్ర పర్యాటక శాఖ చేపట్టింది. దీనికి సంబంధించిన వివరాలతో కూడిన ప్రతిపాదనలను యూనెస్కోకు పంపినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాచీన వస్తు ప్రదర్శన శాలను మరింతగా అభివృద్ధి చేసేందుకు పర్యాటక శాఖ మరో ప్రణాళిక సిద్ధం చేసింది. ఉడుపి నగరానికి ఏడు కిలోమీటర్ల దూరంలో మణిపాల్‌కు చేరువలో ఇది విరాజిల్లుతోంది. ఉడుపి, మంగళూరు, మణిపాల్ సందర్శించే పర్యాటకులు తప్పనిసరిగా వస్తు ప్రదర్శన శాల తిలకించడానికి ఆసక్తి చూపుతున్నారు. పరిశోధన విద్యార్థులకు ఇదొక అధ్యయన కేంద్రంగా మారింది. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల శైలిలో ప్రాచీన భవన నిర్మాణాల నమూనాలు ఇక్కడ ఆవిష్కరించారు. అందులో అరుదైన నవాబ్ మహల్, ముద్దోళ్ ప్యాలెస్, దర్బార్ హాల్, మంగళూరు క్రిస్టియన్ భవనం, కుణ్ణనూరు ప్యాలెస్, నరహరి ఆలయం.. తదితరాలు విస్మయానికి గురిచేస్తాయి. 2018లో బ్యాంకు ఉద్యోగి విజయనాథ్ శైణి సొంత ఖర్చుతో ఆరు ఎకరాల ప్రదేశంలో ప్రదర్శన కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. ఆయనకు ప్రభుత్వం సహాయ, సహకారాలను అందించడంతో అనతి కాలంలోనే విస్తరణకు నోచుకుంది. ప్రాచీన భవనాలు ఏప్రాంతంలో ఉన్నా.. గుర్తించి కొనుగోలు చేసి, ఇక్కడికి తరలించి.. పునర్నిర్మాణం చేపడుతున్నారు. అరుదైన ఎనిమిది ప్రాచీన భవనాల విన్యాసం అబ్బురగొలుపుతుంది. మరో ఎనిమిదింటి రూపురేఖలూ తక్కువేమీ కాదు. పురాతనకాలం నాటి వస్తువుల ప్రదర్శన మరో ఆకర్షణాంశం. ఈ మొత్తం వేదిక వీక్షణకు కనీసం మూడు గంటలు అవసరం. చరిత్ర, ఇంజినీరింగ్ పరిశోధన విద్యార్థుల సందడే ఇక్కడ ఎక్కువ. కట్టడాలను అధ్యయనం చేసేందుకు సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థుల బృందాలు తరలివస్తుంటాయి. తీర పర్యాటకానికి కదిలే వారికి ఇదొక చక్కని మజిలీ!


మంగళూరు ప్రాంతంలో పేరెన్నికగన్న 'క్రిస్టియన్ భవనం'


అందరినీ ఇట్టే ఆకట్టుకునే అలనాటి దర్బార్ హాల్


ప్రదర్శనశాల ఆవరణలో నవాబ్ మహల్.. అంతర్భాగ విన్యాస సౌందర్యం


ప్రాచీన ఇంటి ద్వారం.. అద్భుత కళావిహారం

పోలీస్ అధికారిపై దాడి

రామనగర, న్యూస్‌టుడే : మఫ్టీలో ఉన్న ఎస్సై దుర్గేష్‌పై కొందరు యువకులు దాడి చేసి పరారయ్యారు. ఐజూరు ఠాణాలో సేవలు అందిస్తున్న ఆయన విధి నిర్వహణలో భాగంగా చెన్నబసప్ప, శివరాజులతో కలిసి రాయరదొడ్డి గ్రామానికి బుధవారం సాయంత్రం వెళ్లారు. అక్కడి స్థానికులు కిరణ్ కుమార్, శ్రీకాంత్, చేతన్, మరికొందరు యువకులు దుర్గేష్‌పై దాడి చేసి పరారయ్యారు. పక్కనే ఉన్న కానిస్టేబుళ్లు వారిని పట్టుకునేందుకు విఫలయత్నం చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ఐజూరు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

బస్సులోనే కవలల జననం

రామనగర, న్యూస్‌టుడే : నెలలు నిండడంతో కనకపురలోని కాన్పుల ఆసుపత్రిలో చేరేందుకు వస్తున్న ఓ గర్భిణి ఆర్టీసీ బస్సులోనే ఒక మగ, మరో ఆడబిడ్డకు బుధవారం సాయంత్రం జన్మనిచ్చారు. తమిళనాడు సరిహద్దులోని హుణసనహళ్లి నుంచి వస్తున్న సమయంలో దొడ్డకరెబ్బళ్లి వద్ద ఆమెకు నొప్పులు తీవ్రం కావడంతో బస్సులో ఉన్న కొందరు మహిళలకు ఆమెకు కాన్పు చేశారు.

వంటింట్లో చిరుత!

మంగళూరు, న్యూస్‌టుడే : అక్కసాలికేరి సమీపంలోని సదానంద్ కోట్యాన్ అనే వ్యక్తి ఇంట్లోకి ఒక చిరుత వచ్చింది. రాత్రి ఇంట్లోకి వచ్చిన చిరుత వంటింట్లో ఉండటాన్ని చూసిన సదానంద తక్షణమే తలుపులు మూసి మూడబిదరి విభాగం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. బోను, మత్తు ఇంజక్షన్ తదితరాలతో వచ్చిన సిబ్బంది ఏడాదిన్నర వయసు ఉన్న చిరుతను బంధించి తమతో తీసుకువెళ్లారు.

కరగని వాననీటి మడుగులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాత్రంతా వాన.. పగలంతా ఎండ.. రాజధాని నగరంలో ఇదో విచిత్ర వాతావరణం. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు నగరంలో వాన కురిసింది. మూడు రోజులుగా కురిసిన వర్షంతో వీధుల్లోకి వచ్చిన వరద నీటి ముప్పు తప్పడంలేదు. సాయిలేఅవుట్, హొరమావు, టాటానగర, యలహంక, సిల్కుబోర్డు, మడివాళ తదితర ప్రాంతాల నుంచి నీరు వెనక్కి తగ్గుతున్నా.. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో సమస్య తీరలేదు. ఇప్పటికీ కొన్ని వీధుల్లో నడుము లోతు నీరుంది. ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వెళ్లేందుకు చెక్కపలకలతో స్థానికులు కొందరు పడవలను చేసుకున్నారు. రహదారులపై మురుగు, నీరు ఉండడంతో పలు చోట్ల వాహన సంచారం మందగతిన కొనసాగింది. ఆదివారం నగరంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హాసన, కొడగు, మైసూరు, మండ్య, రామనగర, చిక్కమగళూరు, బెంగళూరు, బెంగళూరు గ్రామీణం, కోలారు, తుమకూరు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కొనసాగుతుందని వాతావరణ శాఖ ప్రకటించింది. వర్షంతో రహదారులపై పడిన గుంతలు, కొట్టుకుపోయిన పాదచారి మార్గాల్లో పాలికె సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. హావేరి, దావణగెరె తదితర జిల్లాల పరిధి పలు గ్రామాల్లో వర్షంతో అంత్య సంస్కారాలు చేయడం కూడా ఇబ్బందిగా మారింది. విధి లేని పరిస్థితుల్లో సమీపంలోని పట్టణాలు, నగరాలకు మృతదేహాలను తీసుకువెళ్లి అంత్యక్రియలు చేయిస్తున్నారు.


అవెన్యూ రోడ్డులో చేరిన మురుగు నీటిలో వెళుతున్న వాహనదారులు


సాయి లేఅవుట్‌లో నీటిలో నడిచి వెళుతున్న స్థానికుడు


కాళ్లు తడవకుండా వెళ్లేందుకు స్థానికులు చేసుకున్న దేశీయ పడవ

ముప్పుతెచ్చిన ప్రవాహాలు

మండ్య, న్యూస్‌టుడే : నాగమంగల తాలూకా బిండిగనవిలె సమీపంలోని ఆణెచెన్నాపుర గ్రామంలో బైకుపై వెళుతున్న రామచంద్ర (67) అనే వృద్ధుడు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మరణించారు. బాధితుడు కంబదహళ్లి గ్రామానికి చెందిన వారు. వాగు వద్ద ప్రవాహం ఎక్కువగా ఉందని, ఆ మార్గంలో వెళ్లవద్దని సూచించినా బుధవారం రాత్రి అటు వెళ్లి రామచంద్ర బైకుతో సహా కొట్టుకుపోయారు. వాగు నుంచి ఆయన మృతదేహాన్ని గురువారం ఉదయం బయటకు తీశారు.


రామచంద్ర మృతదేహం కోసం గాలిస్తున్న అగ్నిమాపకదళ సిబ్బంది

✧ శ్రీరంగపట్టణ తాలూకా శెట్టిహళ్లి వద్ద లోకపావని నదిలో ఎడ్లబండితో సహా కొట్టుకుపోయిన ఒక రైతును స్థానికులు రక్షించారు. ఎడ్లను శుభ్రం చేసి, ఒడ్డున కట్టేసి, బండిని శుభ్రం చేస్తున్న సమయంలో నీటి ప్రవాహంలో బండితో సహా ఆయన 200 మీటర్ల వరకు కొట్టుకుపోయారు. స్థానికులు తక్షణమే స్పందించి, తాళ్లు విసిరి ఆయనను కాపాడారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు నదుల వద్దకు ఎవరూ వెళ్లవద్దని జిల్లా పాలనా యంత్రాంగం ప్రజలను కోరింది.

✧ ధార్వాడ జిల్లా కలఘటగి తాలూకా బేగూరు బిసరళ్లి సమీపంలో వంతెనపై నుంచి కారుతో సహా వాగులోకి కొట్టుకుపోయిన నాగరాజ దేవణ్ణవరను స్థానికులు రక్షించారు. నీటి మధ్యలో ఉన్న పెద్ద కంపచెట్టుకు కారు చిక్కుకుంది. కారులో నుంచి స్థానికులకు ఆయన ఫోన్ చేయడంతో అక్కడకు వచ్చిన అగ్నిమాపకదళ సిబ్బంది నాగరాజను రక్షించారు.

నాగేంద్రకు తాఖీదులు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అక్రమాలకు సంబంధించి మాజీ మంత్రి బి.నాగేంద్రకు ఇచ్చిన బెయిలు రద్దు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఉన్నత న్యాయస్థానంలో అర్జీ వేసుకున్నారు. వాదనలను ఆలకించిన జస్టిస్ ఎం.నాగప్రసన్న దీనికి ఆక్షేపణలు తెలిపేందుకు అవకాశం ఇస్తూ నాగేంద్రకు నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను నవంబరు 15కు వాయిదా వేశారు.

నటి రష్మికకూ భద్రత

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కు ప్రాణహాని తలపెడతామని బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో నటి రష్మికా మందణ్ణకు కూడా భద్రత కల్పించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఆమెకు ఎటువంటి బెదిరింపులు రానప్పటికీ సల్మాన్‌తో కలిసి ఆమె 'సికందర్' అనే సినిమాలో నటిస్తున్నారు. ముందు జాగ్రత్తగా బెంగళూరు, కొడగులోని ఆమె నివాసాల వద్ద భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని కర్ణాటక డీజీపీ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు.

న్యాయపోరాటానికి మరోసారి 'సిద్ధం'

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) అక్రమాలకు సంబంధించి తనను విచారణ చేసేందుకు గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ఇచ్చిన ఆదేశాలను ప్రశ్నిస్తూ మరోసారి న్యాయపోరాటం చేసేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సిద్ధమయ్యారు. లోకాయుక్త విచారణ చేసేందుకు ఉన్నత న్యాయస్థానంలోని ఏకసభ్య పీఠం అనుమతించింది. ఆ తీర్పును రద్దు చేయాలని కోరుతూ ఉన్నత న్యాయస్థానంలో సీఎం అర్జీ వేసుకున్నారు. ఈసారి కూడా సీనియరు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ముఖ్యమంత్రి తరఫున వాదనలు వినిపించనున్నారు.

'కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధం'

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బెంగళూరులోని ఇద్దరు భాజపా ఎమ్మెల్యేలు, ఇతర ప్రాంతాలకు చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని యశ్వంతపుర భాజపా ఎమ్మెల్యే ఎస్టీ సోమశేఖర్ బాంబుపేల్చారు. భాజపాలో కొందరు నాయకుల ఒంటెద్దు పోకడలతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. గురువారం ఇక్కడ తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి సీపీ యోగేశ్వర్‌కు టికెట్ ఇచ్చే విషయంలోనూ అన్యాయం జరిగిందన్నారు. తన కుమారుడ్ని బరిలో నిలుపుతానని, టికెట్ ఇవ్వనని కుమారస్వామి మొదటే ప్రకటించి ఉంటే.. ఇటువంటి పరిస్థితి ఎదురయ్యేది కాదన్నారు.

రేవణ్ణ కేసు వాయిదా

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : తన కుమారుడు ప్రజ్వల్ అత్యాచారానికి పాల్పడిన మహిళ (47)ను అపహరించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి హెచ్‌డీ రేవణ్ణ వేసుకున్న అర్జీలో తప్పులు సరిచేసుకునేందుకు ఉన్నత న్యాయస్థానం అనుమతించింది. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని రేవణ్ణ తన న్యాయవాది సీవీ నాగేశ్ సహాయంతో అర్జీ వేసుకున్నారు. కొత్తగా అర్జీ వేసుకునే బదులుగా.. ఇందులోనే మార్పులు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. పది రోజుల్లోగా మార్పులు చేసుకోవాలని సూచించిన జస్టిస్ ఎం.నాగప్రసన్న తదుపరి విచారణను నవంబరు 15కు వాయిదా వేశారు.

కేంద్రీయ విహార్‌కు తాఖీదులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : రాజకాలువ సమీపంలో నిర్మించిన కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ నివాసుల సంఘానికి పాలికె అధికారులు నోటీసులు జారీ చేశారు. అపార్ట్‌మెంట్ చుట్టూ ఎనిమిది అడుగుల ఎత్తైన గోడను నిర్మించాలని చేసిన సూచనలను ఎందుకు జారీ చేయలేదంటూ నోటీసుల్లో ప్రశ్నించారు

ధర్మవేదికపై వీరేంద్ర వైభవం

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : ధర్మస్థల ధర్మాధికారి డాక్టర్ వీరేంద్రహెగ్గడే 57వ పట్టాభిషేక ఉత్సవం ధర్మస్థలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్కళ జైనమఠ అధ్యక్షులైన లలిత కీర్తి భట్టారక స్వామీజీ, వీసీసీ ప్రముఖుడు కె.హరీష్‌కుమార్, దక్షిణ కన్నడజిల్లా కృషిక సమాజం అధ్యక్షుడు సంపత్ సామ్రాజ్య, ద.క.జిల్లా బస్సుల యజమానుల సంఘం అధ్యక్షుడు రాజవర్మ బల్లాల, తదితర అనేక మంది ప్రముఖులు హాజరై ఆయనను అభినందించారు. అదే వేదికపై హెగ్గడేను సన్మానించారు. కళాకారులు ప్రదర్శించిన వివిధ కార్యక్రమాలు, విచిత్రవేషధారణలు, నృత్య వేడుకలు ఆకట్టుకున్నాయి.


వేదికపై నుంచి కార్యక్రమాలను వీక్షిస్తున్న డాక్టర్ హెగ్గడే తదితరులు


విశేషంగా ఆకట్టుకున్న విచిత్రవేషధారుల ప్రదర్శన

దర్శన్‌కు సహకరించి.. దొరికిపోయాడు

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే : పరప్పన అగ్రహార కారాగారంలో నటుడు దర్శన్ విచారణ ఖైదీగా ఉన్న సమయంలో సిమ్ కార్డు, చరవాణిని పంపించిన- బాణసవాడిలో టూర్స్ అండ్ ట్రావెల్స్‌ను నిర్వహిస్తున్న మణివణ్ణన్ అనే వ్యక్తిని పరప్పన అగ్రహార కారాగారం ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. తన కంపెనీలో డ్రైవరు యాదవ్ పేరిట సిమ్‌ను కొనుగోలు చేసిన నిందితుడు, చరవాణి, కొన్ని దుస్తుల మధ్య పెట్టి కారాగారంలోకి పంపించాడు. భద్రత సిబ్బంది, కొందరు అధికారులు అతనికి సహకరించారు. మొదట ఆ మొబైల్ రౌడీషీటరు ధర్మకు అందింది. ధర్మ దాన్ని దర్శన్‌కు ఇచ్చి పలువురితో మాట్లాడించాడు. మరికొందరితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. ఈ విషయం బయటకు పొక్కిన వెంటనే చరవాణిని మరుగుదొడ్డిలో వేసి ఫ్లష్ చేశాడు. దర్యాప్తు పూర్తి చేసిన పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేశారు.

ఏడు వాహనాలు ధ్వంసం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : యలహంక సమీపంలో గురువారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఏడు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఉపరితల వంతెనపై ఒకకారు వెనుక వరుసగా వచ్చిన ఆరు కార్లు ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదంతో ఉపరితల వంతెనపై గంటకుపైగా వాహన సంచారం నిలిచిపోయింది. వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, యలహంక ట్రాఫిక్ ఠాణా పోలీసులు దిగువ మార్గంలోకి వాహనాలను మళ్లించారు.

సముద్ర తీరంలోనూ మద్యం విక్రయాలు

మంగళూరు, న్యూస్‌టుడే : గోవాలోని బీచ్‌ల తరహాలోనే మంగళూరు, చుట్టుపక్కల ప్రాంతాల బీచ్‌లలో మద్యం విక్రయాలను చేపట్టాలని యోచిస్తున్నామని పర్యాటక శాఖ సంచాలకుడు కేవీ రాజేంద్ర తెలిపారు. 'మంగళూరు కనెక్ట్- 2024' పేరిట గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన పర్యాటక విధానంలో భాగంగా బీచ్‌లలో టెంట్లు వేయడం, మద్యం విక్రయాలు, మద్యపానానికి అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. బీచ్, దానికి అనుబంధంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములలో మద్యం విక్రయాలకు తమ శాఖ చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

వ్యాపారులపై తేనెవల

కలబురగి, న్యూస్‌టుడే : వ్యాపారుల వద్దకు యువతులను పంపించి హనీట్రాప్ చేసి నగదు వసూళ్లకు పాల్పడుతున్న రాజకుమార, ప్రభులింగ హిరేమఠ అనే యువకులను స్టేషన్ బజార్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.96 లక్షల నగదు, 55 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ఒక యువతి సహకారంతో స్థానిక వ్యాపారుల నుంచి రూ.50 లక్షలు వసూలు చేశారని ప్రాథమిక విచారణలో గుర్తించారు. వీరి నుంచి మరిన్ని వివరాలను రాబట్టేందుకు పోలీసులు విచారణను కొనసాగించారు.

మరకుంబి దళితులపై దౌర్జన్యం

● 98 మందికి యావజ్జీవ శిక్ష

గంగావతి,న్యూస్‌టుడే: గంగావతి తాలూకా మరకుంబి గ్రామంలో దళితులపై దాడులు, దౌర్జన్యానికి సంబధించి 98 మందికి యావజ్జీవ శిక్ష ప్రకటిస్తూ కొప్పళ జిల్లా న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఈ నెల 21న విచారణ పూర్తిచేసి తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం గురువారం దీన్ని ప్రకటించింది. 2014లో గంగావతి పట్టణంలో సినిమా టికెట్ల విషయంలో గొడవ చోటుచేసుకుంది. ఈ గొడవ గ్రామానికి పాకి అక్కడ దళితులు, అగ్రవర్ణాల మధ్య అల్లర్లు జరిగాయి. దళితుల గుడిసెలకు నిప్పంటించి కాల్చివేశారు. అప్పట్లో 117 మందిపై కేసులు నమోదయ్యాయి. వీరిలో కొందరు మృతి చెందారు. 101 మందిలో 98 మందికి సుదీర్ఘ విచారణ తరువాత యావజ్జీవ శిక్ష, తలా రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి చంద్రశేఖర్ తీర్పు ఇచ్చారు. మిగిలిన ముగ్గురు దళితులు కావడం వారికి అట్రాసిటీ కేసు అన్వయించనందున ఐదేళ్ల జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధించారు. నిందితులు అందరినీ బళ్లారి జైలుకు తరలించారు.

దేవుడేదిక్కు

బెంగళూరు నగరాన్ని వరుస వానలు ముంచెత్తుతున్న వేళ.. వీధులు మడుగుల్లా దర్శనమిస్తున్నాయి. ఆ వీధుల్లోని పలు ఆలయాలనూ మడుగులు చుట్టుముట్టి భక్తులకు ఇక్కట్లను మిగిల్చాయి. నీటిపాలైన సాయి లేఅవుట్లో సాయి బాబా మందిరంలో తరగని వాననీటిని ఇక్కడ చూడొచ్చు.

- న్యూస్‌టుడే, బెంగళూరు



కిత్తూరు శౌర్యం

రాణి కిత్తూరు చెన్నమ్మ దేశభక్తిని చాటుతూ బెళగావి జిల్లా కిత్తూరులో ప్రారంభమైన వేడుకల్లో భాగంగా గురువారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలో ఓ ఘట్టమిదీ. వివిధ ప్రదర్శనల్లో సినీ కళాకారులూ పాల్గొనడంతో సందడి నెలకొంది.

- న్యూస్‌టుడే, బెళగావి



అధికారులకూ ఈడీ షాక్

మైసూరు, న్యూస్‌టుడే : మైసూరు అభివృద్ధి ప్రాధికారలో చోటు చేసుకున్న అక్రమాలకు సంబంధించి వివరణ ఇచ్చేందుకు తమ ముందు హాజరు కావాలని నలుగురు అధికారులకు ఈడీ నోటీసులు జారీ చేసింది. ముడా అధికారిణి శ్రుతి, తహసీల్దారు రాజశేఖర్, ఎఫ్‌డీసీలు రవి, ప్రశాంత్‌కు నోటీసులు జారీ అయ్యాయి.

హెబ్బాళలో 'మేత' మేళా

సదాశివనగర, న్యూస్‌టుడే : పశువులు, జీవాలకు వినియోగించే వివిధ రకాల మేతకు సంబంధించి మేత మేళాను శుక్రవారం నిర్వహిస్తున్నామని హెబ్బాళ పశు వైద్య కళాశాల ప్రకటించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలుర హాస్టల్ మైదానంలో నిర్వహించే మేళాలో పశు వైద్యశాల, బీదర్ లోని పశువైద్య, మత్స్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ప్రతినిధులు పాల్గొంటారు.

లోకాయుక్త వలలో అధికారి

చామరాజనగర, న్యూస్‌టుడే : మార్టళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కౌదళ్లిలోచెరువు అభివృద్ధి చేసుకునేందుకు అనుమతి ఇచ్చేందుకు రూ.60 వేల లంచాన్ని డిమాండ్ చేసి తీసుకుంటున్న అటవీ శాఖ అధికారి కాంతరాజ్ చౌహాన్‌ను లోకాయుక్త పోలీసులు అరెస్టు చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని గ్రామ పంచాయతీ సభ్యుడు జోసెఫ్ ఆళ్బగన్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కార్యాచరణ నిర్వహించారు.

బెంగళూరు

•బెంగళూరు •హోసూరు

నృత్యహేలకు సర్వం సిద్ధం


నాట్య కళాకారిణి జనని

బెంగళూరు (సాంస్కృతికం) : నగరంలోని కూచిపూడి పరంపర సంస్థ 26న సాయంత్రం నాట్య పరంపర-2024 పేరిట నృత్యోత్సవాన్ని నిర్వహించనుంది. ప్రముఖ నృత్య కళాకారిణి దివంగత యామినీ కృష్ణమూర్తి సంస్మరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ వ్యవస్థాపకురాలు దీపా నారాయణన్ తెలిపారు. కోరమంగళలోని మెడాయ ఆడిటోరియంలో నిర్వహించే ఈ నృత్యోత్సవంలో నాట్య కళాకారులు జనని, కార్తిక మోహన్ (కూచిపూడి), కళాకారుడు దిలీప్, కళా మండలం రోహిన్ తదితరులు నాట్య విన్యాసాలను ప్రదర్శించనున్నారు. నాట్య గురువులు బాలా విశ్వనాథ్, కళానిధి గురు వేదాంతం విదుమౌలిని సత్కరించనున్నారు.

కండక్టర్‌పై దాడిచేసి పరారీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: నగరంలోని టిన్ ఫ్యాక్టరీ సమీపంలో బస్సు పాస్ చూపించాలని అడిగిన కండక్టర్ సంగప్ప తలపై, హేమంత్ అనే ప్రయాణికుడు రాయితో కొట్టి, కడుపులో ముష్టిఘాతాలు కురిపించి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న కేఆర్‌పురం ఠాణా పోలీసులు నిందితుడి ఆధార్ కార్డు ఆధారంగా అతడి కోసం గాలింపు చేపట్టారు.

పోలీసుల అదుపులో బైకుల చోరులు

కలబురగి, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనాలను చోరీ చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఉమర్, అబ్దుల్ సలీం అనే నిందితులను సేడం పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.3 లక్షల విలువైన పది బైకులను జప్తు చేసుకున్నట్లు ఎస్పీ ఎ.శ్రీనివాసులు తెలిపారు.

రైతుల సమస్యల పరిష్కారానికి గడ్కరి హామీ

హోసూరు, న్యూస్‌టుడే : డాబస్‌పేట నుంచి మదగొండపల్లి సమీపం ఉప్పారపల్లి, బైరమంగలం, తొరపల్లి, పేరండపల్లి, ఆలూరు, అట్టూరు, మల్లసంద్రం ద్వారా దేవీరపల్లి వరకు 44 కి.మీ జాతీయ రహదారి పూర్తి కావస్తోంది. రోడ్డుకు అవసరమైన భూములను రైతుల నుంచి తక్కువ ధరకు సేకరించారు. పరిహారం, పొలాలకు దారుల విషయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యలపై మాజీ ఎంపీ నరసింహన్ ఇటీవల చర్చించారు. ఈ నేపథ్యంలో గురువారం నరసింహన్ అన్నదాతలతో దిల్లీ వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరిని కలిసి సమస్యను వినతి పత్రం ద్వారా వివరించారు. భూములు కోల్పోయిన రైతులకు మార్కెట్ ధర నిర్ణయించాలని, అండర్ పాసులు, సర్వీసు రహదారి నిర్మించాలని రైతులు కేంద్రమంత్రి కోరారు. రైతు బృందంలో గోపనపల్లి రవీంద్రనాథ్, మల్లసంద్రం మురళీ, మునివెంకటప్ప, శ్రీనివాసరెడ్డి, పీఎంకే అరుణ్‌రాజ్ ఉన్నారు.


పూలగుచ్ఛాన్ని అందిస్తున్న హోసూరు రైతుల బృందం

అభివృద్ధికి అవినీతే ఆటంకం

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: అవినీతితోనే దేశాభివృద్ధి మందగతిన సాగుతోందని ఉప లోకాయుక్త జస్టిస్ కేఎన్ ఫణీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గురువారం యలహంక ఉపనగరలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రజా సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మానవ హక్కులకు భంగం వాటిల్లకుండా చూడటం, అవినీతి పరుల ఆట కట్టించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అవినీతిపరులు, లంచగొండుల వివరాలను ప్రజలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం, లోకాయుక్త దృష్టికి తేవాలని పిలుపునిచ్చారు. రెండో ఉప లోకాయుక్త జస్టిస్ బీ వీరప్ప, పాలికె ప్రధాన కమిషనర్ తుషార్ గిరినాథ్, జిల్లాధికారి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న జస్టిస్ ఫణీంద్ర తదితరులు

బెంగళూరు (కెంగేరి): యువత అవినీతిని అడ్డుకునేందుకు న్యాయ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని విశ్రాంత న్యాయ మూర్తి సంతోష్ హెగ్డే అన్నారు. నయన సభాంగణంలో ఆయన గురువారం సమాచార హక్కు ఐదో వార్షికోత్సవాన్ని ప్రారంభించి పలు సూచనలు చేశారు. యువత అవినీతిని నిలదీయాలని, సమాజ శ్రేయస్సుకు తప్పించే వారే రాజకీయాల్లోకి రావాలన్నారు. బెట్టహళ్లి మఠం చంద్రశేఖర శివాచార్యస్వామి మాట్లాడుతూ అవినీతికి అడ్డుకట్ట గ్రామ పంచాయతీల నుంచే మొదలు కావాలన్నారు. అనంతరం సహ కమిషన్ తరపున సామాజిక కార్యకర్తలకు ప్రశస్తులు అందజేసి సన్మానించారు. సహ అధ్యయన కేంద్రం ముఖ్యుడు వీరేష్‌బెళ్లూర్, సంస్థాపకుడు హెచ్. రమేష్‌కుణిగల్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

కలబురగి, న్యూస్‌టుడే: భూవివాదంతో చంద్రకాంత జమాదార అనే వ్యక్తి హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను విశ్వ విద్యాలయం ఠాణా పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మౌనేశ్ ప్రధాన నిందితుడని, అతడి సహచరుడితో పాటు ఇద్దరు బాలలను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఆజాద్‌నగరకు చెందిన చంద్రకాంత, మౌనేశ్ మధ్య భూవివాదం ఉంది. ఈ నెల 20న తన అనుచరులతో దాడిచేసి పరారయ్యారు. మౌనేశ్ చికిత్స పొందుతూ 22న మృతి చెందినట్లు కమిషనర్ డాక్టర్ ఎస్‌డీ శరణ బసప్ప తెలిపారు.

స్తంభించిన వాహనాలు రాకపోకలు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు-కృష్ణగిరి జాతీయ రహదారిలో ఓవైపు పనులు జరుగుతుండగా మరోవైపు వర్షాల కారణంగా వాహన సంచారానికి అంతరాయం ఏర్పడుతోంది. భారీ వాహనాలైన కంటైనర్లు, టిప్పర్లు తిరగడంతో రహదారులపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పోలీసులు, పీడబ్ల్యూడీ, జాతీయ రహదారుల శాఖ అధికారులు పట్టించుకోలలేదు. 45 కి.మీ దూరాన్ని చేరుకోవడానికి గంటల సమయం పడుతోంది. ప్రత్యామ్నాయంగా కృష్ణగిరి నుంచి రాయకోట, ఉద్దనపల్లి మార్గంగా హోసూరుకు వెళ్లాలని, హోసూరు నుంచి కృష్ణగిరికి ఉద్దనపల్లి, రాయకోట మార్గంగా చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.


వర్షాలకు బారులుతీరి నిలిచిన వాహనాలు

ఆసుపత్రిలో పెచ్చులూడి రోగికి గాయాలు

చిత్రదుర్గం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో పొరుగనున్న ఆంధ్రప్రదేశ్‌లోని కల్యాణదుర్గం నుంచి చికిత్స నిమిత్తం చిత్రదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన లక్ష్మీ అనే రోగి మంచంపై ఉండగా, గది పైకప్పు పెచ్చులూడి పడటంతో ఆమె తలకు గాయాలైనట్లు జిల్లా ఆసుపత్రి ప్రధాన వైద్యుడు రవీంద్ర తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ఈ ఘటన జరిగిందన్నారు. బాధితురాలిని మరోచోటుకు తరలించి చికిత్స అందించామని, ఎలాంటి ప్రాణాపాయం లేదన్నారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు భవనం పైకప్పు ఉరిసి సిమెంటు పెచ్చులూడి పడ్డాయన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఆసుపత్రిలో భవనాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆసుపత్రి భవనాలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు రోగులు, వారి బంధువులు డిమాండ్ చేశారు. కొంతమంది ఈ ఘటనను తమ సెల్‌ఫోన్లలో తీసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.


రోగి మంచంపై ఊడిపడిన సిమెంటు పెచ్చులు

సమాజ సేవకుడు రవి కన్నుమూత


ఎన్‌ఎస్ రవి

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: సమాజ సేవకుడు, భారతీనగర నివాసుల సంఘం అధ్యక్షుడు ఎన్‌ఎస్ రవికుమార్ (55) గుండెపోటుతో బుధవారం అర్ధరాత్రి మరణించారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డిని చివరి రోజుల్లో ఆయనే చూసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, పారిశుద్ధ్య కార్మికులకు తరచూ బోధన పరికరాలు, దుస్తులు, దుప్పట్లు, నిత్యావసరాలు ఇచ్చేవారు. గత ఆదివారం విపక్ష నేత అశోక్ చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు అందజేశారు. ఆయన మృతి పట్ల సీనియరు నటి తార, విపక్ష నేత అశోక్, శ్రీకృష్ణ సేవా సమితి ప్రతినిధులు, రాజ్‌కుమార్ కుటుంబ సభ్యులు సంతాపాన్ని ప్రకటించారు.

కేంద్ర సలహా మండలిలో ఎంపీ గోపీనాథ్


కె.గోపీనాథ్

హోసూరు, న్యూస్‌టుడే : కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి సలహాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సలహా మండలి ఏర్పాటు చేసింది. ఇందులో ఛైర్మన్‌తో పాటు 16 మంది సభ్యులను నియమించింది. వ్యవసాయ రంగ సమస్యలు, రైతుల సంక్షేమంపై సలహాలు ఇవ్వడానికి ఏర్పాటు చేశారు. ఈ కేంద్ర కమిటీలో కృష్ణగిరి లోక్‌సభ సభ్యుడు, హోసూరుకు చెందిన కె.గోపీనాథ్‌ను సభ్యుడిగా నియమించారు. ఇప్పటికే ఆయన ఆర్థిక మండలిలో సభ్యుడిగా ఉన్నారు.

26న ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

పావగడ, న్యూస్‌టుడే : పావగడ తాలూకా క్షేమాభివృద్ధి, సాంస్కృతిక సంస్థ ఉపకార వేతనానికి ఎంపికైన ప్రతిభావంత విద్యార్థులతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులకు 26న గురు భవనంలో సన్మానం చేయనున్నట్లు ఆ సంస్థ సంఘటనా కార్యదర్శి ఆర్.పి.సాంబసదాశివరెడ్డి తెలిపారు. ఆయన పట్టణంలోని విశ్రాంతి భవనంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ తాలూకాలో 2002-03 విద్యా ఏడాది నుంచి ప్రతిభావంత విద్యార్థులు, ఉత్తమ శిక్షకులకు సన్మానం చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. తాలూకాలోని వివిధ గ్రామాల నుంచి వైద్య, ఇంజినీరింగ్, బీవీఎస్‌సీ, బీఏ, బీకాం, బీఎస్సీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 37 మంది ప్రతిభావంత విద్యార్థులను ఉపకార వేతనానికి ఎంపిక చేశామన్నారు. ఐదు హోబళిలలో హోబళికి ఇద్దరు చొప్పున పదో తరగతిలో పది మంది, పీయూసీ విభాగంలోని పలు కోర్సులలో ఆరుగురు ఉత్తమ విద్యార్థులను ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. తాలూకా నుంచి పది మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని చెప్పారు.

పల్స్ పోలియోపై అవగాహన తప్పనిసరి

తుమకూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పోలియో నిర్మూలన దినోత్సవంలో భాగంగా గురువారం నగరంలోని రోటరీ, ఇన్నర్‌వీల్, వివిధ సంస్థల ఆధ్వర్యంలో పల్స్ పోలియోపై అవగాహన జాతా చేపట్టారు. టౌన్‌హాల్ సర్కిల్‌లో ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. రోటరీ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే పోలియో నిర్మూలన సాధ్యమవుతుందని, అవగాహన పెంచడానికే ర్యాలీ చేపట్టామన్నారు. పోలియో నిర్మూలనకు రోటరీ సంస్థ 580 మిలియన్ డాలర్ల నిధులు వెచ్చించి కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. భారతదేశంలో పోలియో లేనప్పటికీ చుట్టుపక్కల దేశాల్లో కేసులు కనిపించడంతో ముందు జాగ్రత్తగా ర్యాలీ చేపట్టామన్నారు. రోటరీ సంస్థ సంయోజకుడు బెళ్లి లోకేష్, తుమకూరు రోటరీ అధ్యక్షురాలు రాజేశ్వరి, వీరేష్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులు

అమూల్యమైన సంపద యోగా

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే: సమాజానికి రుషి పుంగవులు ఇచ్చిన అమూల్యమైన సంపదే యోగా అని పతంజలి సంస్థాపకుడు బాబా రామ్‌దేవ్ అన్నారు. ఉడుపి శ్రీకృష్ణమఠం రాజాంగణలో గురువారం భారతీయ విద్వత్ పరిషత్, కేంద్రీయ సంస్కృతి విశ్వవిద్యాలయం సహకారంతో ఏర్పాటు చేసిన 51వ అఖిల భారత ప్రాచ్య విద్యా సదస్సు, యోగా శిబిరాన్ని ఆయన మఠాధిపతి సుగుణేంద్రతీర్థ స్వామితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. సంస్కృతం అన్ని భాషలకు మూలమని విశ్వం గుర్తించిన తర్వాతే ఈ భాషను నేర్చుకునేందుకు ముందుకు వస్తున్నారన్నారు. యోగాతో ఆరోగ్యమే కాకుండా జ్ఞానం సిద్ధిస్తుందన్నారు. కోటి గీతా లేఖన యజ్ఞంతో సుగుణేంద్రతీర్థ స్వామి ప్రపంచానికి భగవద్గీత గొప్పదనాన్ని చాటారన్నారు. ఉడుపిలో శ్రీకృష్ణుడి దర్శనం చేసుకొని స్వామి ఆశీర్వాదంతో యోగా శిక్షణనిచ్చే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పతంజలి యోగా పీఠ క్రీడాకారులు కఠినమైన యోగాసనాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పేజావర మఠాధిపతి విశ్వప్రసన్న తీర్థస్వామి, భారతీయ విద్వత్ పరిషత్ ముఖ్యులు ఆచార్య బాలకృష్ణ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న రామ్‌దేవ్, సుగుణేంద్రతీర్థస్వామి తదితరులు

బళ్ళారి
•బళ్ళారి •రాయచూరు


దాతలను సత్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

ప్రభుత్వ పాఠశాలకు భూదానం

మాన్వి : తాలూకాలోని మాడగిరి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కోసం విలువైన స్థలాన్ని విరాళంగా ఇచ్చి ఉదారతను చాటింది పోలీస్ పాటిల్ కుటుంబం. రెండున్నర ఎకరాల భూమిని శంకరగౌడ బెట్టినగౌడ పోలీస్ పాటిల్ స్మరణార్థం ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. బుధవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో క్షేత్ర శిక్షణాధికారి చంద్రశేఖర్ దొడ్డమని ఇతర అధికారులు స్థల దాత సరోజమ్మ శంకరగౌడ పోలీస్ పాటిల్ ఇతర కుటుంబ సభ్యులను సత్కరించారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షురాలు లక్ష్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజాఖాన్, ఉపాధ్యాయుడు హంపణ్ణ చెందూర్, స్థానిక ప్రముఖులు లవకుమార్, హళ్లప్పగౌడ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను విస్మరించొద్దని హితవు


పింఛన్ పత్రం ఇస్తున్న న్యాయమూర్తి సాత్విక్

రాయచూరు: కుటుంబ సభ్యులు వృద్ధులను బాధ్యతతో చూసుకోవాలని జిల్లా న్యాయమూర్తి, న్యాయ సేవల ప్రాధికార సభ్య కార్యదర్శి హెచ్.ఎ.సాత్విక్ సూచించారు. వారి ఇబ్బందులను ఆలకించి, ప్రేమ పూర్వకంగా పలుకరించాలని కోరారు. జిల్లా న్యాయవాదుల సంఘం, తాలూకా పాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో సంయుక్తంగా గురువారం తహసీల్దార్ కార్యాలయం సభాభవన్‌లో వృద్ధులకు న్యాయం-సాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఇంటి పెద్దలు ఎంతో కష్టపడి, ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని మనల్ని ఉన్నత స్థానానికి తెచ్చిన సంగతిని విస్మరించవద్దని హితవు పలికారు. పెద్దల ఆహారం, ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సలహా ఇచ్చారు. హక్కులు పొందేందుకు ప్రాధికార సహాయ, సహకారాలు అందిస్తున్నట్లు వివరించారు. తహసీల్దార్ సురేష్ వర్మ మాట్లాడుతూ పెద్దలు దేశ ఆస్తి అని, వారిని కాపాడుకుందామన్నారు. వృద్ధాప్యంలో జీవనోపాధికి ఎవరిపైనా ఆధారపడరాదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్లు ఇస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా సంధ్యా సురక్షలో 30 మంది, వృద్ధ పౌరుల పింఛన్ పథకంలో 20 మందికి మంజూరు పత్రాలను అందజేశారు. న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్ హమీద్, గ్రేడ్-2 తహసీల్దార్ సయ్యద్ మీర్ అన్వర్ పాల్గొన్నారు.


సూచనలు చేస్తున్న శివానంద

కట్టుదిట్టంగా ఉద్యోగ పరీక్షల నిర్వహణ

రాయచూరు, న్యూస్‌టుడే : రెవెన్యూశాఖలోని ఖాళీ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహిస్తున్న రాత పరీక్షను కట్టుదిట్టంగా, లోపాలకు ఆస్కారం ఇవ్వకుండా జరపాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద అధికారులకు నిర్దేశించారు. పరీక్ష నిర్వహణపై గురువారం జిల్లా పాలనాధికారి కార్యాలయం సభాభవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివానంద మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొలి రోజు ఏడు పరీక్షా కేంద్రాల్లో కన్నడ పరీక్ష మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, 27న పరీక్ష ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నారు. ప్రతి గదిలో గోడ గడియారాన్ని అమర్చాలని, సమయ పాలన పాటించాలని స్పష్టం చేశారు. కేంద్రాలు చుట్టూ 200 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమలు చేయాలని సూచించారు. పీయూసీ విద్యా విభాగం ఉప నిర్దేశకుడు జయరామ్ మాట్లాడుతూ ప్రాధికార నిర్ణయించిన డ్రస్‌కోడ్ ప్రకారం అభ్యర్థులు దుస్తులు ధరించాలన్నారు. ఆయా శాఖల ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

చెన్నపట్టణ.. మాకే పట్టం

సిద్ధరామయ్య ధీమా


నామినేషన్ వేయనున్న యోగేశ్వర్‌తో కలిసి ఊరేగింపుగా వస్తున్న సిద్ధరామయ్య, డీకే శివకుమార్, డీకే సురేశ్

రామనగర, న్యూస్‌టుడే : చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీపీ యోగేశ్వర్ కనీసం 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. చెన్నపట్టణ నియోజకవర్గం అభివృద్ధి బాధ్యతను నేనే తీసుకుంటానని ప్రకటించారు. సీపీ యోగేశ్వర్, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ఎంపీ డీకే సురేశ్‌తో కలిసి చెన్నపట్టణలో సిద్ధరామయ్య గురువారం రోడ్‌షో నిర్వహించారు. యోగేశ్వర్ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర మంత్రి కుమారస్వామి మండ్యకు మాత్రమే పరిమితమయ్యారని, గెలిచినా, ఓడినా చెన్నపట్టణ అభివృద్ధికి, చెరువుల పునర్జీవానికి యోగేశ్వర్ కట్టుబడి ఉండడంతోనే ఇక్కడి నుంచి ఐదుసార్లు గెలిచారని చెప్పారు. భాజపా, దళ్ ఉమ్మడి అభ్యర్థిగా ఎవరు బరిలో నిలిచినా తమ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడక అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. తమది ప్రజా సంక్షేమాన్ని కోరుకునే ప్రభుత్వమని, ప్రజలు మద్దతుగా ఉండడంతోనే పాలన సజావుగా చేస్తున్నామని తెలిపారు. చెన్నపట్టణలో ప్రచారానికి క్రమం తప్పకుండా వస్తానని ప్రకటించారు. రెండుసార్లు ముఖ్యమంత్రి అయినప్పుడు చెన్నపట్టణకు కుమారస్వామి విడుదల చేసిన నిధుల జాబితా ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ డిమాండ్ చేశారు. ఈసారి ఉప ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. యోగేశ్వర్‌తో పాటు వచ్చి చేరిన కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తాము లౌకికవాదులమని చెప్పుకుంటూ, మతతత్వ పార్టీతో చేతులు కలిపిన దళ్‌ను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని విమర్శించారు. పార్టీ అభ్యర్థిని సైతం స్వయంగా ప్రకటించుకునే ధైర్యాన్ని దళ్ చేయలేకపోతుందని ఎద్దేవా చేశారు. టికెట్ ఇస్తారని భాజపాలో చివరి వరకు వేచి ఉన్నా, మొండి చేయి చూపిస్తారని గుర్తించి, కాంగ్రెస్‌లోకి తిరిగి వచ్చానని ఇదే సందర్భంలో యోగేశ్వర్ తెలిపారు.


నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న యోగేశ్వర్.. తోడుగా సిద్ధరామయ్య తదితరులు



కాంతరాజు నివేదిక బహిర్గతపరచాలి


మినీవిధాన సౌధ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న రిజర్వేషన్ సంరక్షణ ఒక్కూట నాయకులు

సింధనూరు, న్యూస్‌టుడే: సుప్రీం కోర్టు రిజర్వేషన్ ప్రక్రియ పనిని రాష్ట్ర ప్రభుత్వానికే వదిలేసింది కదా..అని ప్రభుత్వం కళ్లు మూసుకుని ఎస్సీ వర్గీకరణను జరిపితే ఇందులో 101 సమాజాల ప్రజలు అన్యాయం అయిపోతారు. అందరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కాంతరాజు నివేదికను బయటకు తేవాలని కర్ణాటక రిజర్వేషన్ సంరక్షణా ఒక్కూట నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సింధనూరులో గురువారం నిరసన ప్రదర్శన జరిపారు. ఇందులో కొరమ, కొరచి, భోవి, వడ్డర, లమాణీ సమాజాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇందులో నిపుణుల సలహాలు తీసుకోకుండా ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకేసినా ఊరుకోం అని హెచ్చరించారు. ప్రముఖులు రామకృష్ణ భజంత్రీ, రవి రాథోడ్, వీరేశ్ భోవి తదితరులు పాల్గొన్నారు.

పది మాసాలుగా అందని సామాజిక పింఛన్లు



అధికారికి వినతి పత్రం ఇస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు తహసీల్దార్ కార్యాలయం అధికారులు పది మాసాలుగా సామాజిక ఫించన్లు మంజూరు చేయలేదు. వారం రోజుల్లో చెల్లించకపోతే లబ్ధిదారులతో కలసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని 'కర్ణాటక జనసైన్య, జిల్లా కార్మిక సంఘం' హెచ్చరించింది. ఈ మేరకు గురువారం జనసైన్య జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అరగోలు, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు ఎ.రమేష్ వడవట్టి నాయకత్వంలో ప్రతినిధులు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. రెండు వేల మందికి ప్రతి నెలా పింఛన్ అందనందున కుటుంబ నిర్వహణకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వచ్చే నెల మంజూరు అవుతుందంటూ.. ప్రతి నెలా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంప్యూటర్‌లో కేవైసీ కానందునే జాప్యం జరుగుతోందని చెబుతున్నారని, బ్యాంకుల్లో విచారిస్తే అప్‌డేట్ చేశామని అంటున్నందున లబ్ధిదారులకు దిక్కుతోచడం లేదని వాపోయారు. కేవలం పింఛన్‌పై ఆధారపడి బతుకుతున్నందున సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆపన్నుల హస్తం రెడ్‌క్రాస్


సదస్సును ప్రారంభిస్తున్న యేసప్ప, తదితరులు

రాయచూరు, న్యూస్‌టుడే : మానవత్వం, కరుణ, సేవా భావం లక్ష్యాలతో పనిచేస్తున్న రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో విద్యార్థులు భాగస్వామం కావాలని వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం సహాయక అధ్యాపకుడు, యువ రెడ్‌క్రాస్ విభాగం అధికారి డాక్టర్ యేసప్ప కోరారు. స్థానిక ప్రభుత్వ ప్రథమ శ్రేణి కళాశాలలో గురువారం సదస్సు జరిగింది. యేసప్ప మొక్కకు నీళ్లు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయాలనే సంకల్పం ఉన్న వారికి రెడ్‌క్రాస్ తలుపులు తెరిచి ఉంటాయని తెలిపారు. నోడల్ అధికారి డాక్టర్ ఎం.రవి ప్రపంచ వ్యాప్తంగా అందిస్తున్న సేవలను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుగుణా మాట్లాడుతూ ఎక్కడ దుర్ఘటన జరిగినా వేగంగా స్పందిస్తూ, ఆపన్నులకు చేయూత ఇస్తున్న రెడ్‌క్రాస్ సేవల్లో స్వచ్ఛందంగా పాల్గొనాలని సూచించారు. రెడ్‌క్రాస్ సంచాలకురాలు ఉమాదేవి, ఐక్యూఏసీ సంచాలకురాలు జ్యోతి, అధ్యాపకులు శరణగౌడ, సురేష్ పాటిల్, భీమ శంకరప్ప, స్వరూపరాణి పాల్గొన్నారు.





ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం


సమావేశంలో మాట్లాడుతున్న కుమారనాయక్, హాజరైన నాయకులు

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరు, యాదగిరి జిల్లాలను ప్రగతి పథంలో తీసుకెళ్తానని గెలిపించిన ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానని రాయచూరు ఎంపీ కుమార నాయక్ హామీ ఇచ్చారు. రాయచూరు గ్రామీణ కాంగ్రెస్ గురువారం స్థానిక ఏపీఎంసీ రైతుభవన్‌లో ఎంపీ, ఎమ్మెల్సీ వసంతకుమార్‌ను సన్మానించింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాయచూరు జిల్లా పాలనాధికారిగా, జిల్లాకు సంబంధించి వివిధ అధికార పదవులు నిర్వహించిన తన హయాంలో ఎంతో అభివృద్ధి జరిగిందని వివరించారు. ఇంకా ప్రగతి పనులు చేసేందుకు తొలిసారి పోటీ చేసినా భారీ ఆధిక్యత కట్టబెట్టేందుకు కారణమన్నారు. అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటానని తెలిపారు. వసంతకుమార్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు రానున్న జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తారని వెల్లడించారు. అభ్యర్థి ఎవరైనా పార్టీ విజయం సాధించాలనే పట్టుదలతో ఇప్పటి నుంచే శ్రమించాలని సూచించారు. రాయచూరు గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ మాట్లాడుతూ నిస్వార్థంగా పనిచేసిన వారికి పార్టీ ఏదో ఒక రోజు గుర్తింపు ఇవ్వడం ఖాయమన్నారు. డీసీసీ అధ్యక్షుడు బసవరాజ పాటిల్ ఇటగి, కేపీసీసీ కార్యదర్శి కె.శాంతప్ప, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు ఆశాపూరు చంద్రశేఖర గౌడ, రజాక్, బసవరాజ్, పంపాపతి, హనుమంతు జాలిబెంచి, శశికళ, పవన కిశోర్ పాటిల్ వేదిక మీద ఆసీనులయ్యారు.



'కళాకారులను ప్రోత్సహించాలి'


గోడ పత్రాలను ప్రదర్శిస్తున్న సంఘ సంస్థల నిర్వాహకులు

మాన్వి, న్యూస్‌టుడే : కళాకారులను ప్రోత్సహించాలని, వారిలో నూతన ఉత్సాహాన్ని నింపుతుందని సంఘ సంస్థల నిర్వాహకులు పేర్కొన్నారు. తాలూకాలోని తమ్మాపుర గ్రామానికి చెందిన యువ నటుడు మహిన్ కుబేర్ నటించిన చలన చిత్రాన్ని శుక్రవారం (25న) అపర్ణ చిత్రమందిరంలో విడుదల చేస్తున్న క్రమంలో సంఘ సంస్థల సంచాలకులు విలేకర్ల సమావేశంలో పేర్కొన్నారు మహిన్ పలు ధారావాహికలు, చలన చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషించి ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడని పేర్కొన్నారు. ఆరేళ్లుగా రంగభూమి కళాకారుడిగా రాణిస్తున్న మహిన్ ప్రధాన పాత్రలో నటించిన ప్రకరణ తనిఖా హంతదల్లిదె సినిమా పట్టణంలో విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ప్రేక్షకులు సినిమా చూసి స్థానిక కళాకారుడిని ప్రోత్సహించాలని కోరారు. ప్రభురాజ్ కొడ్లి, ప్రవీణ్‌కుమార్, బుడ్డప్పనాయక్, హనుమేష్ మద్లాపూర్, చిదానందస్వామి, హనుమంతరాయ, శంకర్‌నాయక్ తమ్మాపూర్, సిద్ధరామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత మృతదేహం స్వాధీనం

రాయచూరు, న్యూస్‌టుడే : మటమారి-మంత్రాలయం రైల్వేస్టేషన్ల మధ్య గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని రాయచూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 5.2 అడుగుల ఎత్తు, 60 ఏళ్లు ఉంటాయని, తెల్ల టీషర్టు ధరించినట్లు చారని వివరించారు. మృతదేహం వద్ద చిరునామా లేదు. తెలిసిన సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

24-10-2024 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1631.94	1610.54
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	97,751	508
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	96,487	9,790
నీటి నిల్వ (టి.ఎం.సి)	101.539	38.648

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన చుండ్రు సోహన్‌కుమార్


జెండా ప్రదర్శిస్తున్న చుండ్రు సోహన్‌కుమార్

మాన్వి : పట్టణానికి చెందిన చుండ్రు సోహన్‌కుమార్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించాడు. స్థానిక ఎస్ఆర్ డెవలపర్స్ అధినేత చుండ్రు సూరిబాబు, స్వాతి దంపతుల పెద్ద కుమారుడు సోహన్ ఈనెల 20 పర్వతాన్ని ఎక్కాడు. వాటికి సంబంధించిన ఛాయా చిత్రాలను కుటుంబ సభ్యులతో పంచుకున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు మాన్వి, పీయూసీ బెంగళూరులో చదివిన సోహన్, ప్రస్తుతం విజయవాడలోని ఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తున్నాడు. సిద్ధార్థ త్రిపాఠి ఆధ్వర్యంలో 18 మంది విద్యార్థుల బృందం అక్టోబర్ 11న గన్నవరం నుంచి బయలుదేరి వెళ్లారు. హిమాలయం ఎవరెస్టు శిఖర బేస్ క్యాంప్‌ను నిర్వహించారు. బేస్ క్యాంప్ ద్వారా ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించి సోహన్‌కుమార్ బృందం రికార్డు నెలకొల్పింది. హిమాలయాన్ని అధిరోహించిన దేశంలోని తొలి ప్రైవేట్ కళాశాల విద్యార్థుల బృందం ఇదేనని నిర్వాహకులు వెల్లడించారు. పట్టణానికి చెందిన విద్యా సంస్థల నిర్వాహకులు, సంఘ సంస్థలు హర్షం వ్యక్తం చేశారు.

